



# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక







సంపుటి: 4 సంచిక: 222, పేజీలు - 08

సోమవారం, డిసెంబర్ 23, 2024 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati


## సినీ ఇండస్ట్రీపై కుట్ర

**- బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సినీ ఇండస్ట్రీపై కుట్ర జరుగుతోందన్నారు కేంద్రమంత్రి బండి

2లో..



## కేసీఆర్ ఎక్కడ.?

### ఫామ్‌హౌస్ ఎందుకు వీడడం లేదు.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాలు మళ్లీ వేడెక్కాయి. గత ప్రభుత్వం హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈరేసు వ్యవహారంలో రూ.56 కోట్ల రూపాయలు ఎలాంటి అనుమతి లేకుండా ఓ విదేశీ సంస్థకు కేటాయించినట్లు తేలింది. రిజర్వు బ్యాంకు ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.8 కోట్ల జరిమానా కూడా విధించింది. కేటాయించిన తర్వాత కూడా దానిని ప్రభుత్వం ఆమోదించలేదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిధులు దారిమళ్లినట్లు భావించింది. నాడు మున్సిపల్ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఆదేశంతోనే నిధులు కేటాయించినట్లు అప్పటి ప్రిన్సిపల్ సెక్రెటరీ అరవింద్‌కుమార్ తెలిపారు. దీంతో కేటీఆర్‌పై విచారణకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం గవర్నర్‌ను కోరింది. పూర్వపరాలు పరిశీలించిన గవర్నర్ విచారణకు అనుమతి ఇచ్చారు. దీంతో ఏసీబీ వెంటనే కేసు నమోదు చేసింది. ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన కొన్ని గంటల్లోనే రంగంలోకి దిగిన ఈడీ ఎఫ్ఐఆర్ కాపీతోపాటు డాక్యుమెంట్లు ఇవ్వాలని ఏసీబీకి లేఖ రాసింది. మరోవైపు కేటీఆర్ ఎఫ్ఐఆర్ కొట్టేయాలని హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు కేటీఆర్‌కు పది రోజులు ఉపశమనం కల్పించింది. విచారణ కొనసాగించాలని అనుమతి ఇచ్చింది. 48 గంటల్లోనే ఈ వ్యవహారాలన్నీ చకచకా జరిగాయి. అయినా కేటీఆర్ తండ్రి, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం నోరు మెదపడం లేదు. ఫామ్‌హౌస్

2లో..

## మోదీకి కువైట్ అత్యున్నత పురస్కారం

### - ''ది ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్'' తో సత్కరణ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత ప్రధాని నరేంద్ర మోదీ కువైట్‌లో పర్యటిస్తున్నారు. కువైట్ ఎమిర్ ప్రధాన ప్యాలెస్ అయిన 'బయాన్ ప్యాలెస్'లో ఆదివారం ప్రధాని మోదీకి గార్డు ఆఫ్ హానర్ ఇచ్చారు. కువైట్ అమీర్ షేక్ మెషాల్ అల్-అహ్మద్ అల్-జాబర్ అల్-సబాహ్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ కువైట్ చేరుకున్నారు. గత 43 ఏళ్లలో కువైట్‌లో భారత ప్రధాని పర్యటించడం ఇదే మొదటిసారి. అదే సమయంలో, ఈ పర్యటన ప్రాముఖ్యతను చూసిన కువైట్ ఇప్పుడు

2లో..

## ఏపీ సర్కార్ కు ప్రపంచ బ్యాంక్ షాక్

### - అమరావతికి సాయం అనుమానమే

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కూటమి ప్రభుత్వం శరవేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. ముఖ్యంగా అమరావతి రాజధాని నిర్మాణం పై దృష్టి పెట్టింది. వచ్చే నెల నుంచి పనులు ప్రారంభించాలని చూస్తోంది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం సైతం సానుకూలంగా స్పందించింది. బడ్జెట్లో పదిహేను వేల కోట్ల రూపాయల సాయం ప్రకటించింది. ప్రపంచ బ్యాంకు తోపాటు ఏసియన్ డెవలప్మెంట్ బ్యాంక్ నుంచి ఈ మొత్తం సర్దుబాటు చేయనున్నట్లు చెప్పింది. అటు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు అమరావతి రాజధాని నిర్మాణ పనులు పరిశీలించి నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మొత్తం ఆరు విడతల్లో రుణం మంజూరుకు ముందుకు వచ్చారు. తొలివిడతగా జనవరి నెలాఖరుకు సిఆర్డిఏ కు నిధులు ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు. ఈ తరుణంలో ఏపీ నుంచి ప్రపంచ బ్యాంకుకు ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది.

2లో..




## అల్లు అర్జున్ ఇంటిపై దాడి

**-ఓయూ జేఏసీ ముట్టడి**

**- స్పందించిన సీఎం రేవంత్**

**- సీపీకి కీలక ఆదేశాలు**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లోని ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఇంటిని ఓయూ జేఏసీ నాయకులు ముట్టడించారు. ఇంటి గోడలు ఎక్కి రాళ్లు విసిరారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో రేవతి కుటుంబాన్ని ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఇంటి లోపలికి వెళ్లేందుకు యత్నించగా అక్కడి సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. రాళ్లు తగిలి ఇంటి ఆవరణలోని పూల కుండీలు ధ్వంసమయ్యాయి. రేవతి చావుకు

2లో..



## అల్లు అర్జున్ ఏమన్నా తీస్‌మార్‌ఖానా?

**- ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడకుంటే తోలు తీస్తామంటూ ఏసీపీ విష్ణుమూర్తి వార్నింగ్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో ప్రస్తుతం అల్లు అర్జున్ వర్సెస్ ప్రభుత్వం అన్న విధంగా నడుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా శనివారం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. దీనిపై స్పందించిన బన్నీ సాయంత్రం ప్రెస్ మీట్ పెట్టి రేవంత్ వ్యాఖ్యలను తప్పుబట్టారు. తాను ఎలాంటి రోడ్ షోలు చేయలేదని సీఎం అలా మాట్లాడడం సరికాదని అన్నారు. ఈ అంశంపై సినీ, రాజకీయ ప్రముఖులు ఎవరికి తోచిన విదంగా వారు స్పందిస్తున్నారు. తాజాగా,

2లో..

## సీఎంకు అల్లు అర్జున్ వెంటనే క్షమాపణ చెప్పాలి

**- అల్లు అర్జున్ వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి స్పందన**

**- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు ఎదురుదాడిగా మాట్లాడడం సరికాదని స్పష్టీకరణ**

**- మనిషి చనిపోయాక ఐకాన్ స్టార్ అయితే ఏంటి? సూపర్ స్టార్ అయితే ఏంటి?**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన సంచలనం రేకెత్తించగా శనివారం అసెంబ్లీలో అల్లు అర్జున్‌పై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అటు సినీ, ఇటు రాజకీయ వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు రేపాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో ఇది హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అల్లు అర్జున్, సినీ ఇండస్ట్రీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం ఐకాన్ స్టార్ ప్రెస్ మీట్‌పై ఆయన స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డికి బన్నీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తన ఇమేజ్ దెబ్బతీశారంటూ సీఎం వ్యాఖ్యలపై ఎదురుదాడిగా మాట్లాడడం సరికాదన్నారు.

### మానవత్వం లేకుండా ఉంటారా.?

'ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించేందుకు

2లో..

## అల్లు అర్జున్‌కు మేం వ్యతిరేకం కాదు

**- అల్లు అర్జున్ సినీ హీరో కావొచ్చు**

**- కానీ ప్రజల ప్రాణాలే మాకు ముఖ్యం**

**- నటీనటులు పరిస్థితులు అర్థం చేసుకోవాలి**

**- ప్రైవేట్ బాడీ గార్డ్స్, బౌన్సర్లు హద్దుల్లో ఉండాలి**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సంధ్య థియేటర్ వద్ద పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ చనిపోగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. అల్లు అర్జున్ సినిమా హీరో అయి ఉండొచ్చు, కానీ ఓ పౌరుడిగా బాధ్యతాయుతంగా ఉండాలని తెలంగాణ డీజీపీ జితేందర్ అన్నారు. అల్లు అర్జున్‌కి మేం వ్యతిరేకం కాదు. కానీ ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే చట్టప్రకారం యాక్షన్ తీసుకుంటాం.

2లో..

## సినిమా చూశాకే వెళ్తానని బన్నీ అన్నారు

### - ఆధారాలతో సహా బయటపెట్టిన తెలంగాణ పోలీసులు

**- సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై సీపీ ప్రెస్ మీట్**

**- సంచలన విషయాలు వెల్లడించిన పోలీసులు**

**- అల్లు అర్జున్ చెప్పిందంతా అబద్ధమేనా.?**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సంధ్య థియేటర్ ఘటనపై శనివారం అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన కామెంట్స్‌తో ఈ వ్యవహారం మరోసారి తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాఫిక్‌గా మారింది. అల్లు అర్జున్ అత్యుత్సాహం, పోలీసుల మాట వినకపోవటం వల్లే రేవతి అనే మహిళ చనిపోవటమే కాకుండా ఆమె కుమారుడు చావు బతుకుల మధ్య పోరాడుతున్నారని రేవంత్ అసెంబ్లీ వెల్లడించారు. రేవంత్ కామెంట్లపై అల్లు అర్జున్ సైతం స్పందించారు. శనివారం రాత్రి ప్రెస్‌మీట్ పెట్టిన ఆయన సీఎం వ్యాఖ్యలు బాధ కలిగించాయని చెప్పారు. పోలీసులు పర్మిషన్ ఇస్తేనే తాను థియేటర్‌కు వెళ్లాలని రేవతి చనిపోయిన విషయం తనకు మర్నాడు తెలిసిందన్నారు. కాగా, అల్లు అర్జున్ చేసిన ఈ కామెంట్లపై తాజాగా హైదరాబాద్ సీపీ కీలక విషయాలు వెల్లడించారు. ఆ రోజు థియేటర్ వద్ద

2లో..

## చదరంగంలో నారా దేవాన్ష్ ప్రపంచ రికార్డు

**- ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్-175 పజిల్స్ ను సాధించిన నారా దేవాన్ష్**

**- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ నుంచి సర్టిఫికెట్**

**- నారా కుటుంబం హర్షం**

2లో..



## చంద్రబాబుకు తగ్గిన భద్రత?

### - భద్రతకు అటానమస్ డ్రోన్లు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు భద్రతను తగ్గించుకున్నారు. అదేంటి ఎవరైనా భద్రతను పెంచుకుంటారు కదా తగ్గించుకోవడం అనుకుంటున్నారా. ఈ నిర్ణయం వెనుక ఓ మంచి కారణమే ఉంది. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుంచి చంద్రబాబు భ్రదత పేరుతో ప్రజల్ని ఇబ్బంది పెట్టొద్దని పదే, పదే చెబుతున్నారు. తిరుమల వెళ్లిన సమయంలో భద్రత పేరుతో పరదాలు కట్టగా వెంటనే తొలగించమని చెప్పారు. ఆ తర్వాత కూడా తన కోసం గంటల తరబడి ట్రాఫిక్‌ను ఆపొద్దని సూచించారు. తనను ప్రజలుకు, కార్యకర్తలకు దూరం చేసేలా సెక్యూరిటీ ఉండకూడదని ఆదేశించారు. కానీ నిఘా విభాగం, సెక్యూరిటీ వింగ్ మాత్రం ప్రోటోకాల్ ఉంటుంది కాబట్టి తప్పదంటున్నారు. ఈ క్రమంలో పోలీసులు, ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి భద్రతకు సంబంధించి సాంకేతికతను పెంచి

2లో..

ప్రజాప్రశ్న



# సినీ ఇండస్ట్రీపై కుట్ర

సంజయ్. సినీ పరిశ్రమపై పగబట్టినట్లుగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సంధ్య థియేటర్ ఘటనలో మహిళ మృతిని అందరూ ఖండించారన్నారు. శ్రీతేజ్ కోలుకోవాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని తెలిపారు. మృతురాలు రేవతి కుటుంబానికి అందరూ బాసటగా నిలిచారన్నారు. ఈ సమస్య ముగిసిన తర్వాత అసెంబ్లీలో ఎంఐఎం సభ్యుడితో ప్రశ్న అడిగించారని సినిమా తరహా కథ అల్లి మళ్లీ సమస్యను సృష్టించారని బండి సంజయ్ ఆరోపించారు. ప్రణాళిక ప్రకారం అసెంబ్లీ వేదికగా సినీ ఇండస్ట్రీని దెబ్బతీసే కుట్ర చేశారని ధ్వజమెత్తారు. అల్లు అర్జున్ వ్యక్తిత్వ హననం చేసేలా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేశారన్నారు. ఎంఐఎం ఐరన్ లెగ్ పార్టీ అని బండి సంజయ్ అన్నారు. గతంలో బీఆర్ఎస్‌ను ఎంఐఎం నిండా ముంచిందని.. ఎంఐఎంను నమ్మితే కాంగ్రెస్‌కు కూడా బీఆర్ఎస్ గతే పడుతుందన్నారు బండి సంజయ్. ఎంఐఎంతో కలిసి క్కా ప్రణాళిక ప్రకారం పవిత్రమైన అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం సినీ ఇండస్ట్రీని దెబ్బతీసే కుట్ర చేస్తోందన్నారు.మీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కలుషిత ఆహారం తిని గురుకుల విద్యార్థులు చనిపోతున్నారనని వారి కుటుంబాలను సీఎం రేవంత్ ఏనాడైనా రామర్శించారా? అని ప్రశ్నించారు. ఆ మరణాలకు మీరు బాధ్యత వహించారా? మీకో న్యాయం ఇతరులకు మరో న్యాయమా? ఇకనైనా రేవంత్ కక్ష సాధింపు చర్యలు వీడాలి అని బండి సంజయ్ హితవు పలికారు. సినిమా ఓపెనింగ్ రోజు అగ్ర హీరోలు ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌కు రావడం 50 ఏళ్లు షరా మామూలేనని చెప్పారు. పాన్ ఇండియా సినిమా బెన్ ఫిట్ షోకు భారీ ఎత్తున ప్రేక్షకులు రావడం కద్దూ సాధారణమేనని అన్నారు. ఈ విషయం తెలిసి కూడా ముందస్తు రక్షణ ఏర్పాట్లు చేయకపోవడం ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి అమాయక మహిళ బలైందని ఆమె కుమారుడు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే ఆ తప్పును ఇతరులపై నెట్టడం సిగ్గు చేటని బండి సంజయ్ విమర్శించారు.

# కేసీఆర్ ఎక్కడ.?

వీడి బయటకు రావడం లేదు. ఎన్నికల్లో గడిచిన ఏడాది కాలంలో ఒక్క రోజు మాత్రేమే అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్, తర్వాత ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. దీంతో కేసీఆర్‌కు ఏమైంది అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. క్యాడర్‌లో కూడా ఈ ప్రశ్నలకు సమాధానం లేక గందరగోళం నెలకొంది.

### తనకు సంబంధం లేదన్నట్లు..

తెలంగాణ రాష్ట్ర ఉద్యమం, ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావంలో కేసీఆర్ పాత్ర కీలకమైనది. అందుకే తెలంగాణ ప్రజలు 2024, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ సారథ్యంలోని గులాబీ పార్టీని గెలిపించారు. దాదాపు పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్ 2023 ఎన్నికల్లో పార్టీని గెలిపించలేదు. దీంతో ప్రతిపక్షానికి పరిమితమయ్యారు. ఓడిపోగానే తెలంగాణతో, తెలంగాణ ప్రజలతో తనకు సంబంధం లేదన్నట్లు ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. రాష్ట్రంలో ఏం జరిగినా స్పందించడం లేదు. చివరకు తన కొనడుకు కేటీఆర్‌పై కేసు నమోదు చేసినా స్పందించలేదు. తనను గెలిపించిన ప్రజల తరఫున మాట్లాడేందుకు కూడా అసెంబ్లీకి రావడం లేదు.

### ఎందుకీ మౌనం.?

కేటీఆర్ అరెస్ట్ అయ్యే పరిస్థితి వచ్చినా ఏసీబీ, ఈడీ రెండూ ఫార్ములా ఈరేసు కేసుపై ఆరా తీస్తున్నా కేసీఆర్ మౌనం వీడడం లేదు. కోర్టు పది రోజుల గడువు ఇచ్చింది. పది రోజుల తర్వాత కేటీఆర్ అరెస్టు కావడం ఖాయం అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈమేరకు ఏసీబీ చర్యలు చేపడుతోంది. మరోవైపు ఈడీ కూడా తమ కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉంది. దీంతో వ్యవహారం మరింత ముదిరే అవకాశం ఉంది. ఇది రూ.56 కోట్ల స్కామ్ కాదని, రూ.600 కోట్ల స్కామ్ అని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించడం, అసెంబ్లీ వేదికగానే ఆరోపించడంతో కేటీఆర్‌కు ఉచ్చు బిగించాలన్న ఆలోచనలో రేవంత్ సర్కార్ ఉందన్నది స్పష్టమైంది. అయినా కేసీఆర్ నోరు మెదపడం లేదు.

### నాడు కూతురు విషయంలోనూ..

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవితను ఈడీ అరెస్టు చేసిన సమయంలో కూడా కేసీఆర్ స్పందించలేదు. మీడియా ముందు మాట్లాడలేదు. కనీసం ఖండించలేదు. లోక్‌సభ ఎన్నికల సమయంలో నేతలతో నిర్వహించిన మీటింగ్‌లో మాత్రమే కడుపు తరుక్కుపోతుందని అన్నారు. తాజాగా కేటీఆర్ వ్యవహారంలోనూ అలాగే ఉన్నారు. తండ్రే స్పందించకపోతే పరిస్థితి ఏంటి అని గులాబీ నేతలు గుసగుసలాడుతున్నారు.

### కాంగ్రెస్‌కు ప్లస్..

కేసీఆర్ మౌనం కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్లస్ పాయింట్ అవుతోంది. ఆయన అసెంబ్లీకి రాకపోవడం, ప్రజల సమస్యలపై స్పందించకపోవడం, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టకపోవడం ఇలా అన్నీ రేవంత్ సర్కార్‌కు కలిసి వస్తున్నాయి. మరోవైపు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రం కేసీఆర్ తాగి ఫాంహౌస్‌లో పడుకుంటున్నారని విమర్శిస్తున్నారు. కేసీఆర్ తీరే ఈ విమర్శలకు కారణం.

# మోదీకి కువైట్ అత్యున్నత పురస్కారం

ప్రధాని మోదీని తన అతిపెద్ద గౌరవం 'ది ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్'తో సత్కరించింది. కువైట్ ప్రభుత్వం అత్యున్నత గౌరవం ది ఆర్డర్ ఆఫ్ ముబారక్ కబీర్ ను భారత ప్రధాని మోదీకి ప్రదానం చేసింది. భారత ప్రధాని నరేంద్ర మోదీకి లభించిన 20వ అంతర్జాతీయ గౌరవం ఇది. ఈ ముబారక్ అల్ కబీర్ గౌరవం కువైట్ నైట్‌హుడ్‌గా పరిగణిస్తారు. దేశాధినేతలు, విదేశీ సార్వభౌమాధికారులు, విదేశీ రాజకుటుంబ సభ్యులకు ఈ గౌరవాన్ని స్నేహానికి చిహ్నంగా ప్రదానం చేస్తారు. ప్రధాని మోదీ కంటే ముందు అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, ప్రిన్స్ చార్లెస్, జార్జ్ బుష్ వంటి విదేశీ నేతలకు ఈ గౌరవం దక్కింది.సన్మానాన్ని స్వీకరించిన అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ "కువైట్ అమీర్ షేక్ మెషాల్ అల్-అహ్మద్ అల్-జాబర్ అల్ సబాహ్ చేత ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్ కబీర్ అందుకున్నందుకు గౌరవంగా భావిస్తున్నాను. నేను ఈ గౌరవాన్ని భారతదేశ ప్రజలకు తెలియజేస్తున్నాను. ఇక భారతదేశం, కువైట్ మా మధ్య ఉన్న బలమైన స్నేహానికి ఈ గౌరవాన్ని అంకితం అంటూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. కువైట్ క్రౌన్ ప్రిన్స్ సబా అల్-ఖలీద్ అల్-సబాతో ప్రధాని నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. కువైట్ ఎమిర్ షేక్ మెషాల్ అల్-అహ్మద్ అల్-జాబర్ అల్ సబాతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం కువైట్ ఎమిర్ షేక్ మెషాల్ అల్-అహ్మద్ అల్-జాబర్ అల్ సబాతో అద్భుతమైన సమావేశం జరిగింది. ఇరు దేశాల మధ్య ఫార్మాస్యూటికల్స్, ఐటి, ఫిన్‌టెక్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్,భద్రత వంటి కీలక రంగాలలో సహకారం గురించి చర్చించినట్లు తెలిపారు. సన్నిహితులకు అనుగుణంగా. సంబంధాలు, మేము మా భాగస్వామ్యాన్ని వ్యూహాత్మక స్థాయికి పెంచాము. రాబోయే కాలంలో మా స్నేహం మరింత పెరుగుతుందని నేను ఆశాభావంతో ఉన్నాను. దీని తరువాత, భారతదేశం, కువైట్ మధ్య ప్రతినిధి స్థాయి చర్చలు కూడా జరిగాయని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు.

# అల్లు అర్జున్ ఇంటిపై దాడి

అల్లు అర్జునే కారణమంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. బన్నీ ఇంటి ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో కొందరు ఇంట్లోకి దూసుకెళ్లేందుకు యత్నించగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులను అరెస్ట్ చేశారు. కాగా, నిరసన సమయంలో అల్లు అర్జున్ కుటుంబ సభ్యులెవరూ బయట కనిపించలేదు. విద్యార్థి సంఘాల ఆందోళనతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బన్నీ ఇంటి వద్ద భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.ఈ దాడి ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తాజాగా స్పందించారు. సినీ ప్రముఖుల ఇళ్ల పై దాడి ఘటనను ఖండిస్తున్నానని చెప్పారు. ఈ విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని అన్నారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాల్సిందిగా రాష్ట్ర డీజీపీ, నగర పోలీసు కమిషనర్‌ను ఆదేశించారు. సంధ్య థియేటర్ ఘటనలో సంబంధం లేని పోలీసు సిబ్బంది స్పందించకుండా ఉన్నతాధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు సీఎం రేవంత్ ట్వీట్ చేసారు.దాడి ఘటనను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సైతం ఖండించారు. శాంతి భద్రతలను రక్షించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. సినీ పరిశ్రమను, కళాకారులను కాంగ్రెస్ ప్రభుత్వం టార్గెట్ చేయడం ఆనవాయితీగా మారిందని ట్విట్టర్ వేదికగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఫైరయ్యారు. కాగా, ఈ ఘటనపై అల్లు అర్జున్ తండ్రి అల్లు అరవింద్ స్పందించారు. ఇది సరైన విధానం కాదన్నారు. తాము సంయమనం పాటిస్తున్నామని చెప్పారు.ఇక దాడి జరిగిన సమయంలో ఇంట్లో అల్లు అర్జున్ లేరు. ఆయన పిల్లలు ఇంట్లోనే ఉండగా.. అక్కడకు చేరుకున్న అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి పిల్లల్ని తీసుకొని వెళ్లిపోయారు. ఇక అల్లు అర్జున్ ఇంటికి చేరుకున్న పోలీసులు అరవింద్ నుంచి కంప్లైంట్ తీసుకున్నారు. అనంతరం ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఇంటి వద్ద భద్రత ఏర్పాటు చేశారు.ఘటనపై వెస్ట్‌జోన్ డీసీపీ స్పందించారు. దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. 'ఈరోజు సాయంత్రం 4.45 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్‌లోని నటుడు అల్లు అర్జున్ నివాసం వద్దకు కొందరు వ్యక్తులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. సెక్యూరిటీ సిబ్బంది అభ్యంతరం చెప్పడంతో గోడ దూకి లోపలికి వెళ్లారు. భద్రతా సిబ్బందిపై దాడి చేసి ర్యాంప్‌లో ఉంచిన కొన్ని పూల కుండీలను ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారంతా ఓయూ-జేఏసీకి చెందిన వారిగా తెలిసింది. వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.' అని డీసీపీ ప్రెస్‌నోట్‌లో వెల్లడించారు.

# ఏపీ సర్కార్ కు ప్రపంచ బ్యాంక్ షాక్

అమరావతి విషయంలో కొన్ని అభ్యంతర వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. అయితే ఫలానా వ్యక్తి అని కాకుండా అపరిచిత వ్యక్తుల రూపంలో ప్రపంచ బ్యాంకుకు లేఖలు రాసినట్లు తెలుస్తోంది. దీంతో అమరావతి పనులు మొదలు పెట్టాలన్న ఏపీ సర్కార్కు షాక్ తగిలినట్లు అయింది.

### అప్పట్లో అలా

గతంలో టిడిపి ప్రభుత్వం ఉన్న సమయంలో అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు నిధులు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. అప్పట్లో ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంకు తో కలిసి 3,500 కోట్ల రూపాయలు ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంకు ముందుకు వచ్చింది. అయితే అప్పట్లో వైసీపీ దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా చంద్రబాబు సర్కార్ భూ సమీకరణ చేపట్టినట్లు అప్పట్లో ఫిర్యాదు చేసింది. అప్పటికే కేంద్ర భూ సేకరణ చట్టం అమల్లో ఉన్నా దానిని పరిగణలోకి తీసుకోకుండా చంద్రబాబు సర్కార్ భూ సమీకరణ చేసిందని అభ్యంతరం వ్యక్తం చేసింది. అయినా సరే చంద్రబాబు సర్కార్ ప్రపంచ బ్యాంకును ఒప్పించి నిధుల విడుదలకు అడ్డంకులు లేకుండా చేసింది. అయితే ఇంతలో ఏపీలో ప్రభుత్వం మారింది.వైసీపీ అధికారంలోకి వచ్చింది. అమరావతికి నిధులు ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంకు ముందుకు వచ్చినా జగన్ సర్కార్ మాత్రం అందుకు అంగీకరించలేదు. దీంతో నిధుల విషయంలో వెనక్కి తగ్గింది ప్రపంచ బ్యాంకు.

### ఇప్పుడు తప్పుడు ఫిర్యాదులు

ఇప్పుడు తాజాగా కేంద్ర ప్రభుత్వం మధ్యవర్తిత్వంతో 15 వేల కోట్ల రూపాయల నిధులు సర్దుబాటుకు ప్రపంచ బ్యాంకు ముందుకు వచ్చింది. ఇప్పుడు కూడా ఏషియన్ డెవలప్మెంట్ బ్యాంక్ తో కలిసి ఆ మొత్తం ఇచ్చేందుకు అంగీకరించింది. పలుమార్లు అమరావతి ప్రాంతాన్ని సందర్శించిన ప్రపంచ బ్యాంకు బృందం వచ్చే నెలలో మొదటి విడత నిధులు అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సరిగ్గా ఇదే సమయంలో అపరిచిత వ్యక్తుల నుంచి ప్రపంచ బ్యాంకుకు ఫిర్యాదులు వెళ్లాయి.

### నిబంధనలకు విరుద్ధమట

ఇప్పుడు కూడా అమరావతి రాజధానికి సంబంధించి భూ సమీకరణ నిబంధనలకు విరుద్ధంగా జరిగిందన్నది ఈ ఫిర్యాదు సారాంశం. పైగా అమరావతికి కృష్ణానది వరద ముంపు ఉందని..అక్కడ రాజధాని నిర్మాణం అనేది ప్రమాదకరమని అపరిచిత వ్యక్తులు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. అయితే గతంలో ఇటువంటి ఫిర్యాదులు వచ్చినా క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలుసుకున్న ప్రపంచ బ్యాంకు నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.పైగా ఇప్పుడు చేసింది అపరిచిత వ్యక్తులు. ఇటువంటి ఫిర్యాదులను పరిగణలోకి తీసుకునే ఛాన్స్ లేదని కూటమి వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికీ అమరావతి రాజధాని నిర్మాణానికి వైసీపీ అడ్డు తగులుతోందని కూటమి పార్టీలు విమర్శిస్తున్నాయి. మొత్తానికైతే అమరావతి పనులు ప్రారంభించాలనుకుంటున్న టిడిపి సర్కార్ కు ఇది గట్టి హెచ్చరిక. దీనిని గుణపాఠంగా మార్చుకొని ప్రపంచ బ్యాంకు నిధులను సక్రమంగా వినియోగించుకుంటే మంచిది. లేకుంటే టిడిపి కూటమి ప్రభుత్వానికి ఇబ్బందికరమే. మరి ప్రభుత్వం ఎలా ముందుకు వెళ్తుందో చూడాలి.

# అల్లు అర్జున్ ఏమన్నా తీస్‌మార్‌ఖానా?

తెలంగాణ డీజీపీ జితేందర్ సైతం ఈ అంశంపై స్పందించారు. అల్లు అర్జున్ సినిమా హీరో అయి ఉండొచ్చని, కానీ ఓ పౌరుడిగా బాధ్యతాయుతంగా ఉండాలని అన్నారు. అల్లు అర్జున్‌కి మేం వ్యతిరేకం కాదని కానీ ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే చట్ట ప్రకారం యాక్షన్ తీసుకుంటామని హెచ్చరించారు. థియేటర్ వద్ద ఆ రోజు జరిగిన సంఘటన దురదృష్టకరమని అన్నారు.

### కొంచెమైనా బాధ్యత ఉందా.?

తాజాగా, అల్లు అర్జున్‌పై ఏసీపీ సబ్బతి విష్ణుమూర్తి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఈ అంశంపై మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్లు అర్జున్ ఏమాత్రం బాధ్యత లేకుండా ప్రవర్తించాడని మండిపడ్డారు. 'బన్నీ ఇష్టమొచ్చినట్లు ప్రెస్ మీట్లు పెట్టి పోలీసులపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. పోలీసులెవరూ ఫ్యాన్స్‌కు చేతులు ఊపుతూ అభివాదం చేయమని చెప్పలేదు. ఆయన ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాడు. ఇద్దరు మనుషులు అక్కడ శవాల్లాగా పడి ఉంటే పట్టించుకోకుండా వెళ్లిపోయాడు. ఈ సంఘటన తర్వాత అల్లు అర్జున్ చాలా సక్సెస్ మీట్స్‌లో పాల్గొన్నారు. ఆయనకు కొంచెమైనా సామాజిక బాధ్యత ఉందా ? చట్టానికి విరుద్దంగా ప్రెస్ మీట్లు పెట్టినందుకు కోర్టులో అల్లు అర్జున్‌కు బెయిల్ రాకుండా చేయాలి' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### అల్లు అర్జున్ ఏమన్నా తీస్‌మార్‌ఖాన్‌వా.?

అల్లు అర్జున్ ఏమైనా తీస్‌మార్‌ఖాన్ అనుకుంటున్నాడా! అంటూ ఏసీపీ విష్ణుమూర్తి ఘాటు వ్యాఖ్యలు చేశారు. అసలు బన్నీకి తెలంగాణలో ఆధార్ కార్డు ఉందా.? అంటూ ప్రశ్నించారు. 'పోలీస్ అధికారులు నాకు చెప్పలేదు అంటున్నావు నీకు ఎందుకు చెప్పాలి.?. నువ్వు ఏమన్నా తీస్‌మార్‌ఖాన్ అనుకుంటున్నావా.? నువ్వు మామూలు పౌరుడివి.. నీకు ఆధార్ కార్డు ఆంధ్రలో ఉందా తెలంగాణలో ఎక్కడ ఉందో కూడా తెలియదు. అసెంబ్లీలో నీ వల్ల గంట సమయం పోయింది. నీ గురించి మేము ఎందుకు బాధపడాలి.? తెలంగాణ సమాజం సౌమ్యులు కాబట్టి మీరు ఇంకా ఇక్కడ నాటకాలు చేస్తున్నారు. సినిమా వాళ్ల దాదాగిరి ఏంటీ.? ఇష్టమొచ్చినట్లు టికెట్ రేట్లు పెంచారు. ఇన్ని రూ.కోట్లు పెట్టి సినిమాలు తీయమని మేము బ్రతిమిలాడామా?.' అంటూ నిలదీశారు.

### సినిమా వాళ్ల బట్టలూడదీస్తాం

అల్లు అర్జున్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని.. లేదంటే తోలు తీస్తామని ఏసీపీ విష్ణుమూర్తి హెచ్చరించారు. 'సినిమా వాళ్లు వాపును చూసి బలం అనుకుంటున్నారు. మీ వాపును ప్రజలే తీసి పడేస్తారు. ఇంకోసారి పోలీసులను ఎవరైనా అవమానించే విధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదు. చట్టపరంగా, న్యాయపరంగా ముందుకెళ్తాం. ప్రజల్లోకి తీసుకెళ్లి మరీ సినిమా వాళ్ల బట్టలూడదీస్తాం. మీరు ఉన్నదే లీజు జాగాలో. జూబ్లీహిల్స్ ఏరియాలో మీకు అంత పెట్టి డబ్బులు ఎక్కడివి.?. అప్పట్లో ఉన్న రాజకీయ నాయకులు ఎవరో ఇండస్ట్రీ అభివృద్ధి కావాలని మీకు భూములు ఇచ్చారు. ఊరూరా తిరిగి సినిమా వాళ్ల బట్టలు ఊడదీస్తాం.' అంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

# చంద్రబాబుకు తగ్గిన భద్రత?

సెక్యూరిటీని తగ్గించారు. చంద్రబాబు భద్రతకు సంబంధించి సాంకేతిక సాయాన్ని వినియోగిస్తున్నారు పోలీసులు. ఈ మేరకు ముఖ్యమంత్రి సెక్యూరిటీ కూడా గణనీయంగా తగ్గించారు. భారీ భద్రత, బందోబస్తుకు దూరంగా ఉంటున్నారు. అయితే పోలీసులు చంద్రబాబు నివాసంలో అటానమస్ డ్రోన్ల సాయంతో భద్రతను పర్యవేక్షిస్తున్నారు. అంటే సెక్యూరిటీ సిబ్బందిని తగ్గించి టెక్నాలజీ సాయం తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీంతో అందుకు తగిన విధంగా చర్యలు తీసుకున్నారు. చంద్రబాబు నివాసం ఉండే ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో అత్యాధునిక డ్రోన్‌ను ఏర్పాటు చేశారు పోలీసులు. పోలీసులు ఈ డ్రోన్ సాయంతో ముఖ్యమంత్రి షెడ్యూల్‌కు తగిన విధంగా ప్రతి రెండు గంటలకు ఒకసారి ఉండవల్లి నివాస పరిసర ప్రాంతాల్లో డ్రోన్‌తో షూట్ చేస్తున్నారు. ఒకవేళ అనుమానాస్పదంగా ఏదైనా కనిపిస్తే మానిటరింగ్ టీమ్‌కు సమాచారం అందిస్తారు. చంద్రబాబు నివాసంలో ఏర్పాటు చేసిన ఈ డ్రోన్ అటానమస్ విధానంలో ఆటోపైలట్‌గా ఆ సమయానికి ఎగురుతుంది. మళ్లీ దానికదే డక్‌పై ల్యాండ్ కాగానే ఛార్జింగ్ అవుతుంది. ఈ డ్రోన్ పంపే డేటాను పరిశీలిస్తూ సెక్యూరిటీ అధికారులు ఇంటి పరిసరాల్లో సెక్యూరిటీ పర్యవేక్షిస్తున్నారు. అదే విధంగా జిల్లాల్లో అధికారులకు కూడా ఇవే ఆదేశాలను పాటించాలని నిర్ణయించారు.. ఈ మేరకు ప్రభుత్వం క్లారిటీ ఇచ్చిందట. ఈ మేరకు తగిన విధంగా ముఖ్యమంత్రి ఆదేశాలతో భద్రతలో మార్పులు చేశారు సెక్యూరిటీ సిబ్బంది. అలాగే గత ప్రభుత్వంలో సీఎంకు 900మందికిపైగా భద్రత కల్పించేవారని.. ప్రస్తుతం చంద్రబాబుకు 121మందితో భద్రత కల్పిస్తున్నట్లు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కాన్వాయ్‌లో 17 వాహనాలు ఉంటే ప్రస్తుతం చంద్రబాబు జడ్ ప్లస్ భద్రత ఉన్న చంద్రబాబు కాన్వాయ్‌లో 11 వాహనాలు ఉన్నాయి. అంటే చంద్రబాబు వీలైనంత వరకు భద్రతను తగ్గించుకున్నారనే చెప్పాలి. మొత్తం మీద ఏపీ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం ఆసక్తికరంగా మారింది.

# సినిమా చూశాకే వెళ్తానని బన్నీ అన్నారు

ఏం జరిగిందో మీడియాకు తెలిపారు. అందుకు సంబంధించిన వీడియో దృష్యాలను కూడా మీడియాకు చూపించారు. ప్రత్యక్ష సాక్షి, డ్యూటీలో ఉన్న చిక్కడపల్లి ఏసీపీ రమేష్ ద్వారా జరిగిన విషయాన్ని వెల్లడించారు. ఏసీపీ రమేష్ ఏం చెప్పారో ఆయన మాటల్లోనే 'అల్లు అర్జున్ మేనేజర్ సంతోష్‌కు ముందు తెలియజేశాం. ఒక లేడీ చనిపోయారు ఓ పిల్లాడు తీవ్ర గాయాల పాలయ్యాడు పరిస్థితి కంట్రోల్‌లో లేదని చెప్పాం. మీకు ఇబ్బంది ఉంటుంది అని చెప్పాం. ముందు అల్లు అర్జున్ మేనేజర్ మమ్మల్ని కలవనివ్వలేదు. మేం అల్లు అర్జున్‌కు చెబుతామని సంతోష్ అన్నారు. కానీ వారు వెళ్లలేదు. అదే సమయంలో మా డీసీపీ సార్ వచ్చారు.డీసీపీ సార్ సూచనతో వాళ్లను నెట్టుకుంటూ నేను అల్లు అర్జున్ వద్దకు వెళ్లాను. అల్లు అర్జున్ చెవిలో చెప్పాను. ఓ లేడీ చనిపోయిందని పిల్లాడు గాయపడ్డాడని చెప్పాను. పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉందని పోలీసులు రూట్ క్లియర్ చేశామని ఆయనకు చెప్పాం. అయినా అల్లు అర్జున్ వినిపించుకోలేదు. సినిమా పూర్తయిన తర్వాతే వెళ్తానని అల్లు అర్జున్ అన్నారు. అప్పుడు మా డీసీపీ సార్‌కు చెప్పాం. అప్పుడు సార్, మేం మరోసారి లోపలికి వెళ్లాం. ఓ 10-15 నిమిషాలు టైం ఇచ్చాం. ఆ తర్వాత ఆయన్ను బయటకు తీసుకొచ్చాం. వాస్తవంగా జరిగింది ఇదే.' అని రమేష్ వెల్లడించారు. ఇక సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన పర్మిషన్ లెటర్‌పై కూడా పోలీసులు కీలక విషయాలు వెల్లడించారు. తాము థియేటర్ యాజమాన్యానికి ఎటువంటి పర్మిషన్ ఇవ్వలేదని చెప్పారు. లెటర్ ఓ వైపు మాత్రమే వైరల్ చేస్తున్నారు.

పర్మిషన్ లెటర్ వెనకాలే కుదరని రాసినట్లు స్టేషన్ ఎస్‌హెచ్‌వో రాజు నాయక్ వెల్లడించారు. తాను ఓరల్‌గా కూడా వారికి పర్మిషన్ లేదని చెప్పినట్లు తెలిపారు. సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ సంధ్య థియేటర్ ఘటనలో ఇంకా ఏం కాలేదని ఇక ముందు ఇంకా చాలా ఉందని చెప్పారు. కేసు కోర్టులో ఉన్నందను ఇంతకు మించి వివరాలు వెల్లడించలేమని అన్నారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం ఇప్పడి వరకు అల్లు అర్జున్ చెప్పినదంతా అబద్ధమని కొందరు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

# సీఎంకు అల్లు అర్జున్ వెంటనే క్షమాపణ చెప్పాలి

లీగల్ టీమ్ ఒప్పుకోలేదని అల్లు అర్జున్ అనడం హాస్యాస్పదం. అసెంబ్లీలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తే ఇమేజ్ దెబ్బతిన్నదని అంటున్నారు. ఇది పద్ధతి కాదు. అల్లు అర్జున్ పర్మిషన్ లేకుండా థియేటర్‌కు వెళ్లాడు. మా వద్ద అన్ని ఆధారాలున్నాయి. బన్నీ కామెంట్స్ సీఎంను అగౌరవపరిచే విధంగా ఉన్నాయి. వాటిని వెనక్కి తీసుకోవాలి.' అని మంత్రి కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో ఉన్న శ్రీతేజ్‌ను చిరంజీవి ఎందుకు పరామర్శించట్లేదని ఆయన ప్రశ్నించారు. సినిమా ఇండస్ట్రీ వాళ్లు మొత్తం ఇలాగే మానవత్వం లేకుండా ఉంటారా.? అంటూ నిలదీశారు. తెలంగాణలో ఇక బెనిఫిట్ షోలు ఉండవంటూ స్పష్టం చేశారు. అటు, శనివారం తెలంగాణ అసెంబ్లీ ముగిసిన వెంటనే మంత్రి కోమటిరెడ్డి సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి వెళ్లి బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించారు. బాలుని ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం రేవతి కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అటు, రేవతి కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు.

మరోవైపు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అల్లు అర్జున్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాటలను తప్పుపట్టేలా బన్నీ వ్యవహరిస్తున్నారని ఆయన తీరు దారుణంగా ఉందని అన్నారు. 'అల్లు అర్జున్‌లో కనీసం పశ్చాత్తాపం కనిపించట్లేదు. రేవతి కుటుంబంపై సానుభూతి చూపించలేదు. మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ తెచ్చిన ప్రస్తావనపైనే సీఎం స్పందించారు. పోలీసులు చెప్పినా వినకుండా అల్లు అర్జున్ థియేటర్‌లో షో చేశారు. ప్రాణాల కంటే పేరు ప్రతిష్టలు ఎక్కువా.?' అంటూ నిలదీశారు.

### సీఎం రేవంత్ వ్యాఖ్యలివే.!

కాగా, సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనకు హీరో అల్లు అర్జున్ రావడమే కారణమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించగా దీనికి అసెంబ్లీలో సీఎం సమాధానమిచ్చారు. ఓ హీరో తన సినిమా చూసేందుకు థియేటర్‌కు రావడంతో జరిగిన తొక్కిసలాటలో ఓ మహిళ చనిపోగా ఆమె కుమారుడు చావుబతుకుల మధ్య ఉన్నాడని.. ఆ సమయంలోనూ నటుడు వాహనం రూఫ్ టాప్ నుంచి ఫ్యాన్స్‌కు అభివాదం చేస్తూ వెళ్లిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొక్కిసలాట ఘటనపై ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, బాధ్యులైన థియేటర్ యాజమాన్యంతో పాటు హీరోపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. ఈ వ్యాఖ్యలను బన్నీ తప్పుపట్టారు.

# అల్లు అర్జున్‌కు మేం వ్యతిరేకం కాదు

థియేటర్ వద్ద ఆ రోజు జరిగిన సంఘటన దురదృష్టకరం అన్నారు.కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో భరోసా కేంద్రాన్ని డీజీపీ జితేందర్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీసులు ఎవరికీ వ్యతిరేకం కాదు. పౌరుల రక్షణ, భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. అల్లు అర్జున్ సినిమా హీరో కావొచ్చు. బయట మాత్రం ఆయన ఓ సాధారణ పౌరుడు. ప్రతి పౌరుడు తమ వంతుగా బాధ్యతాయుతంగా ప్రవర్తించడం ఎంతైనా అవసరం. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అర్థం చేసుకుని మసలుకోవాలి. సినిమా ప్రమోషన్లు, ఈవెంట్ల కంటే మాకు ప్రజల భద్రతే ముఖ్యం. ప్రజల ప్రాణాల కంటే సినిమా ఈవెంట్లు ముఖ్యమైన విషయం కాదు. చట్టాన్ని అతిక్రమిస్తే ఎవరిపై అయినా చర్యలు తప్పవు. అల్లు అర్జున్‌కు తాము వ్యతిరేకం కాదని' స్పష్టం చేశారు. సినిమా నటులైనప్పటికీ బయట వీరు సాధారణ పౌరుల్లా వ్యవహరించాలి. సినీ నటుడు మోహన్ బాబుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆయన విషయం కుటుంబ సమస్య కానీ, జర్నలిస్టుపై దాడితో మోహన్ బాబుపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. పరిమితులకు లోబడి, పరిస్థితిని అర్థం చేసుకుని వ్యవహరిస్తే ఎవరికీ ఏ సమస్యా ఉండదు. లేనిపక్షంలో కేసుల్లో ఇరుక్కుని ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు తెలంగాణ డీజీపీ.

### మధ్యంతర బెయిల్ రావడంతో అల్లు అర్జున్ విడుదల

సంధ్య థియేటర్ వద్ద పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా డిసెంబర్ 4న తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతిచెందగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ సికింద్రాబాద్ లోని కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. కొన్ని రోజుల కిందటితో పోల్చితే బాలుడి పరిస్థితి కొంచెం మెరుగైందని హాస్పిటల్ శనివారం హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. చిక్కడపల్లి పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి అల్లు అర్జున్ సహా కొందరు నిందితుల్ని అరెస్ట్ చేశారు. అల్లు అర్జున్ కు నాంపల్లి కోర్టు రెండు వారాల రిమాండ్ విధించగా చంచల్ గూడ జైలుకు తరలించారు. హైకోర్టుకు వెళ్లడంతో నటుడికి నాలుగు వారాల మధ్యంతర బెయిల్ రావడంతో జైలు నుంచి విడుదలయ్యారు.

### ప్రైవేట్ బాడీ గార్డ్స్, బౌన్సర్లు హద్దుల్లో ఉండాలి..

బౌన్సర్లు, ప్రైవేట్ బాడీ గార్డ్స్ పేరుతో చట్టానికి వ్యతిరేకంగా ఎవరిపైనైనా దాడులు, బెదిరింపులు చేస్తే క్రిమినల్ కేసులతో జైలు ఊచలు లెక్కించాల్సి వస్తుందని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. బౌన్సర్లకైనా,ప్రైవేట్ బాడీ గార్డ్స్ కైనా పరిమితులు ఉంటాయని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు వెంటాడుతాయని స్పష్టం చేశారు.

# చదరంగంలో నారా దేవాన్ష్ ప్రపంచ రికార్డు

అమరావతి (ప్రశ్న న్యూస్) సీఎం చంద్రబాబు మనవడు, మంత్రి నారా లోకేశ్ తనయుడు దేవాన్ష్ చెస్‌లో ప్రపంచ రికార్డు నెలకొల్పారు. వేగంగా పావులు కదపడంలో అరుదైన రికార్డు సృష్టించారు. 'వేగవంతమైన చెక్‌మేట్ సాల్వర్ - 175 పజిల్స్' వరల్డ్ రికార్డు కైవసం చేసుకొని ప్రతిష్టాత్మకమైన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ నుంచి అధికారిక ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. ఈ ఘనత పట్ల నారా కుటుంబం హర్షం వ్యక్తం చేసింది. వ్యూహాత్మకమైన ఆటతీరు, థ్రిల్లింగ్ ప్రదర్శనతో దేవాన్ష్ 'చెక్‌మేట్ మారథాన్' పేరుతో ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఈ రికార్డ్‌లో క్రమక్రమంగా సవాలు చేసే చెక్‌మేట్ పజిల్స్ క్రమాన్ని పరిష్కరించారు. ప్రసిద్ధ చెస్ సంకలనం నుంచి ఎంపిక చేసిన 5,334 సమస్యలు, కలయికల ద్వారా ఈ పోటీని రూపొందించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్ మార్గదర్శకత్వంతో దేవాన్ష్ ఈ రికార్డును సాధించగలిగారు. 9 ఏళ్ల చిన్న వయసులోనే మనవడు సాధించిన ఘనత పట్ల ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. వెల్ డన్ దేవాన్ష్ అంటూ మనవడ్ని మనస్ఫూర్తిగా అభినందించారు. "175 పజిల్స్ ను పరిష్కరించి ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్ సాధించడమే గాకుండా వరల్డ్ రికార్డు నెలకొల్పినందుకు కంగ్రాచ్యులేషన్స్. అంకితభావం, కఠోర శ్రమ, పట్టుదల ఇవే విజయానికి సూత్రాలు. ఈ ఘనతను సాధించడానికి నువ్వు గత కొన్ని నెలలుగా ఎంతో శ్రద్ధగా సాధన చేశావు. నువ్వు సాధించిన వరల్డ్ రికార్డు పట్ల గర్విస్తున్నాను నా లిటిల్ గ్రాండ్ మాస్టర్" అంటూ చంద్రబాబు మనవడిపై ప్రశంసల వర్షం కురిపించారు.

### మరో 2 రికార్డులు

ఇదిలా ఉండగా ఇటీవల దేవాన్ష్ మరో 2 ప్రపంచ రికార్డులను కూడా సాధించాడు. 7 డిస్క్ టవర్ ఆఫ్ హనోయిని కేవలం 1.43 నిమిషాల్లో పూర్తి చేశాడు. 9 చెస్ బోర్డ్‌లను కేవలం 5 నిమిషాల్లో అమర్చాడు, మొత్తం 32 ముక్కలను వేగవంతంగా సరైన స్థానాల్లో ఉంచాడు. దేవాన్ష్ ప్రపంచ రికార్డు ప్రయత్నాలను న్యాయనిర్ణేతలు, లండన్‌లోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. పట్టుదల, కృషి ద్వారా తమ కలలను సాధించవచ్చని దేవాన్ష్ నిరూపించాడు. ఇది భారతీయ పిల్లల అపారమైన ప్రతిభకు, వారిలో దాగి ఉన్న అత్యుత్తమ నైపుణ్యాలకు మచ్చుతునక. సరైన ఎక్స్‌పోజర్, మార్గదర్శకత్వంతో మన పిల్లలు ఉన్నతస్థానానికి చేరుతారనడానికి దేవాన్ష్ నిదర్శనమని పలువురు నిపుణులు కొనియాడారు.

తన కుమారుడు ఈ ఘనత సాధించడం పట్ల మంత్రి లోకేశ్ సంతోషం వ్యక్తం చేశారు. దేవాన్ష్ లేజర్ షార్ప్ ఫోకస్‌తో శిక్షణ పొందడం ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. 'దేవాన్ష్ ఈ క్రీడను ఎంతో ఇష్టంగా స్వీకరించాడు. గ్లోబల్ అరేనాలో భారతీయ చెస్ క్రీడాకారుల అద్భుతమైన, చారిత్రాత్మక ప్రదర్శనల నుంచి ప్రేరణ పొందాడు.

గత కొన్ని వారాలుగా ఈ ఈవెంట్ కోసం ప్రతి రోజూ 5 నుంచి 6 గంటలు శిక్షణ పొందాడు. దేవాన్ష్‌కు చెస్ పాఠాలు నేర్పిన రాయ్ చెస్ అకాడమీకి ధన్యవాదాలు' అని లోకేశ్ తెలిపారు.

### కోచ్ ప్రశంసలు

ఈ సందర్భంగా దేవాన్ష్‌పై కోచ్ కె.రాజశేఖర్ రెడ్డి ప్రశంసలు కురిపించారు. సృజనాత్మకంగా చెస్ నేర్చుకునే డైనమిక్ విద్యార్థి అని.. 175 సంక్లిష్టమైన పజిల్స్‌ను ఆసక్తిగా పరిష్కరించగలిగిన మానసిక చురుకుదనం అతని సొంతమన్నారు. దేవాన్ష్ చెస్ ప్రయాణంలో ఇదో మైలురాయి అని కొనియాడారు.

## మెదక్ చర్చి 100 సం:లు గా విశ్వాసం,

# నమ్మకం,దేవుని కృప కు మార్గనిర్దేశనం

**అనేక మంది జీవితల మార్పుకు శ్రీకారం**

**విజయానికి ,క్రీస్తు బోధనలకు జీవం ఇచ్చే ప్రతీక**

**శాంతి కోరేవారికి మెదక్ చర్చి ప్రతీక**

**గవర్నర్ విష్ణు దేవ్ వర్మ**

**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** గవర్నర్ కు ఘనంగా స్వాగతం పలికిన మెదక్ శాసనసభ్యులు మైనం పల్లి రోహిత్ రావు ఆదివారం మెదక్ జిల్లా పర్యటనకు వచ్చిన గవర్నర్ ముందుగా స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్పీ ,అదనపు కలెక్టర్ లు, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డిలు, పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు.తెలంగాణ రాష్ట్ర గవర్నర్ గౌరవ జిష్ణు దేవ్ వర్మ గారు ఆదివారం మెదక్ చర్చి కి రాక సందర్భంగా గురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత చర్చి ప్రాంగణంలోకి రాగానే మెదక్ ఆర్డీఓ రమాదేవి గవర్నర్ గారికి పూల బొకె అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. చర్చి నిర్వాహకులు రెడ్ కార్పెట్ వేసి ఘనమైన స్వాగతం పలికారు. గవర్నర్ క్రీస్తు శిలువ వద్దకు వెళ్లి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం గురువులు గవర్నర్ ను శాలువా, చర్చి నమూనా విగ్రహాన్ని గవర్నర్ కు అందజేశారు.మెదక్ చర్చి 100 సం:రాలు పూర్తి అయిన సందర్భంగా ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ సన్మాననీయ అతిథులు, సోదరులు, సోదరీమణులు, మరియు పిల్లలు, ఈరోజు మేడక్ కాథెడ్రల్‌లో ఈ ఆనందకరమైన సందర్భంగా ఒకటిగా సమావేశమై ఉన్న మీ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.మేడక్ కాథెడ్రల్ 2024 శతాబ్ది ఉత్సవాలలో పాల్గొనడం నాకు ఎంతో ఆనందాన్నిస్తుందన్నారు. ఇది కేవలం 100 సంవత్సరాల సంబరమే కాదు, విశ్వాసం, తపన, మరియు భగవంతుని అమోఘమైన కృపకు నిదర్శనంగా నిలిచే ఒక మహత్తర ఘట్టం అని పేర్కొన్నారు.ఈరోజు మనం ఇక్కడ సమావేశమైన ఈ సందర్భంలో క్రీస్తు చెప్పిన మాటలను ఆలోచిద్దాం: "ఎక్కడ ఇద్దరు లేదా ముగ్గురు నా నామంలో కూడి ఉన్నారో, అక్కడ నేను వారితో ఉంటాను." గత శతాబ్దంగా, మేడక్ కాథెడ్రల్ అనేక మందికి దైవ సాన్నిధ్యానికి కేంద్రంగా నిలిచిందనీ, ఒక విశ్వాసం పెంపొందిన స్థలంగానే కాక అనేకమంది జీవితాలు మారిన ప్రదేశంగా నిలిచిందన్నారు.

మేడక్ కాథెడ్రల్ పునాదిని 20వ శతాబ్దం ప్రారంభంలో మహా కష్టకాలంలో, కరువు వేధించిన సమయంలో వేశారు. రేవరెండ్ చార్లెస్ వాకర్ గారు తమ అపారమైన విశ్వాసంతో మరియు దయతో నడిపింపబడుతూ, ప్రజలకు ఉపశమనం ఇచ్చి, భవిష్యత్తు తరాల కోసం ఆశకి సౌధంగా నిలిచే దేవాలయాన్ని నిర్మించే స్వప్నం చూసారన్నారు.గోతిక్ రివైవల్ శైలిలో నిర్మించబడిన ఈ కాథెడ్రల్, ఏషియా ఖండంలోని అతిపెద్ద చర్చిలలో ఒకటిగా నిలుస్తోందనీ. 5,000 మందికి పైగా భక్తులను ఆశ్రయించే సామర్థ్యం గల ఈ చర్చి, దాని అద్భుతమైన మినారులు, అందమైన స్టెయిన్డ్ గ్లాస్ విండోలు, మరియు స్ఫూర్తిదాయకమైన రూపకల్పనతో, కేవలం శిల్పకళా మాత్రమే కాకుండా, ఈ సమాజం ఉమ్మడిగా కలిసికట్టుగా సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచిందన్నారు.మేడక్ కాథెడ్రల్ కేవలం ఒక నిర్మాణం కాదుబీ ఇది క్రీస్తు బోధనలకు జీవమిచ్చే ప్రతీక. "మీకు తెలిసిన ఈ నా అన్నదమ్ములలో ఎవరికి చేసినా, నాకు చేసినట్లే." ఈ మాటలకు అనుగుణంగా గత శతాబ్దంగా ఈ చర్చి అనేకమందికి విద్య, వైద్యం, మరియు ఆధ్యాత్మిక మార్గనిర్దేశనం అందించిందనీ గుర్తు చేశారు.ఈ శతాబ్ది ఉత్సవం కృతజ్ఞతతో పాటు, క్రియాశీలతకు పిలుపుగా కూడా నిలుస్తుందనీ. ఈ పవిత్ర స్థలం వారసత్వాన్ని గౌరవించే సమయంలో, దాని ప్రేమ, సేవ, మరియు న్యాయానికి చేసే కృషికి మనమందరం మరోసారి సంకల్పం చేసుకుందమని. "నేను మిమ్మల్ని ప్రేమించినట్లే, మీరు ఒకరిని మరొకరు ప్రేమించండి" అనే క్రీస్తు బోధనకు ఈ కాథెడ్రల్ ప్రతీకగా నిలుస్తుందనీ పేర్కొన్నారు.ఈ శతాబ్ది ఘట్టం మేదక్ కాథెడ్రల్ పనిని కొనసాగించడానికి మనందరినీ ప్రేరేపించాలన్నారు. అవసరమైన వారికి చేయూత అందించటంలో, సామాజిక న్యాయానికి బలంగా నిలవడంలో, ఈ ప్రపంచంలో ప్రేమా దీప్తిని వ్యాపింపజేయడంలో మన కృషి కొనసాగించాలనీ పిలుపునిచ్చారు. ఈ 100 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన చర్చిలో కృపానుగ్రహాన్ని దేవునికి సమర్పించుకుంటూ, ఈ గొప్ప దేవాలయాన్ని మనకు



ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానీ. అలాగే, ఈ ప్రయాణాన్ని సాధ్యం చేసిన అనేకమంది మిషనరీలు, కార్మికులు, సమాజ నాయకులు, మరియు భక్తుల అంకితభావానికి మన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుందమన్నారు. క్రీస్తు మాటలను నెరవేరుస్తూ, "మీరు ప్రపంచానికి వెలుగై ఉండాలి. కొండమీద ఒక పట్టణం దాచబడలేదు," మేదక్ కాథెడ్రల్ ఆ పట్టణంలా నిలిచి, ఆధ్యాత్మిక శక్తి , శాంతిని కోరేవారికి మార్గదర్శిగా ఉండాలన్నారుమేదక్ కాథెడ్రల్ భక్తులందరికీ శ్రేయోభిలాషులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ శతాబ్ది ఉత్సవం, మరొక శతాబ్దపు సేవ, విశ్వాసం, మరియు పరివర్తనకర ప్రభావానికి నాంది కావాలని కోరుకుంటున్నానారు.

మీ అందరికీ ఒక శుభక్రిస్మస్ , నూతన సంవత్సర శుభాకాంక్షలు అన్నారు. "గౌరవం దేవునికి భూమిమీద శాంతి అందరికీ" అనే సందేశం మన ప్రభువైన యేసు క్రీస్తు మనకు అందించారనీ. అందరి జీవితాల్లో శాంతి, అభివృద్ధి, విజయాలు ఉండాలని కోరుకుంటున్నాన్నారు.జై హింద్, జై భారత్ అంటూ ముగించారు. చర్చి కమిటీ సభ్యులు శాలూవాతో సన్మానించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం లో ఎంఎల్ఏ రోహిత్ రావు,గవర్నర్ కార్యదర్శి దన కిషోర్, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్,జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్, ప్రెస్ ట్రీటర్ ఇంచార్జ్ శాంతయ్య , చర్చి కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్గానిక్ ఆహార పదార్థాలు లభించే మూలసంత

**- ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా నిర్వహిస్తున్న సి ఎస్ ఆర్ - మూలసంతాలతో పూర్వికుల జీవన విధానం ఆచరణ**







**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** డాక్టర్ మర్రి చెన్నా రెడ్డి భార్య మర్రి సావిత్రి దేవి. 100 వ జన్మదిన సందర్భంగా, సి ఎస్ ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ ద్వారా నిర్వహించబడే మూల సంత కార్యక్రమం డిసెంబర్ 21, 2024 నుండి జనవరి 5, 2025 వరకు, మర్రి చెన్నారెడ్డి మెమోరియల్ రాక్ గార్డెన్, ఇందిర పార్క్ (యన్.టి.ఆర్.స్టేడియం ఎదురుగా ) జరుగుతుందన్నారు. సేవా మాల 2024 సామాజిక ప్రభావం, ఐక్యతపై బలమైన దృష్టితో విభిన్న కమ్యూనిటీలను ఒకచోట చేర్చడం, సహకారాన్ని పెంపొందించడం, మన మూలాలకు మళ్లీ ఆచరించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఫెస్టివల్లో నేపథ్య ప్రదర్శనలు, ప్రముఖ ఎన్జీవో లు, సామాజిక సంస్థలు, వ్యవస్థాపకుల నుండి 100 స్టాల్స్, అలాగే ప్రభావవంతమైన నాయకులతో సెషన్లు ఉంటాయి. ఇది



ఆరోగ్య సంరక్షణ, విద్య, పర్యావరణం, సాంకేతికత, సైబర్ భద్రత, పాలన, కళలు, ఆధ్యాత్మికత మరిన్ని వంటి కీలకమైన రంగాలను కవర్ చేస్తుంది. యువత, వృద్ధులు, మహిళలు, పిల్లలు, రైతులు, సైనికులు ప్రత్యేక సామర్థ్యం గల వారికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తుందన్నారు. శ్రీ కృష్ణారెడ్డి ట్రస్ట్ కోసం "సేవా మాల 2024" సమన్వయం చేస్తున్నారు. వీరిలో వసుధ దేవి, సుదర్శన్ రెడ్డి, కృష్ణారెడ్డి, నిర్వాణ, కుమారి.కావ్య, కుమారి. సావిత్రి, మిస్టర్ రవీందర్ రెడ్డి పలువురు హాజరయ్యారు. డాక్టర్ ఎం. చెన్నా రెడ్డి యొక్క ఇతర సీనియర్ నాయకులు, అనుచరులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## ఇ.వి.ఎం లు కాదు ..

# అసలు సమస్య తెలుసుకోవాలి


ఇ.వి.ఎంలపై సుప్రీంకోర్టులో మరో వ్యాజ్యం దాఖలయింది. దీనిపై జనవరి 20వ తేదీతో ప్రారం భమయ్యే వారంలో విచారణ జరగనుంది. న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా ఆధ్వర్యంలోని బెంచ్ విచారణ జరుపుతుందని శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం ప్రకటించింది. ఇదే తరహా ఉపశమనం కోరుతూ దాఖలైన పిటిషన్‌లను కోర్టు గతంలో తిరస్కరించిన విషయం తెలిసిందే. ఎన్నికల్లో తిరిగి బ్యాలెట్ పత్రాలను ప్రవేశపెట్టాలన్న పిటిషన్‌ను జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ఏప్రిల్‌లో తిరస్కరించిన సంగతి కూడా తెలిసిందే. మరోవైపు, ఎన్నికల విధానాలు, ఈవీఎంల స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్లలో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ, దాని మిత్రపక్షాలు ఆరోపిస్తున్నాయి. వాస్తవానికి, ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతిసారి కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని తెరమీదకు తెస్తోంది. ఇటీవల హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా పరాజయం పాలైన తర్వాత కూడా అదే జరగుతోంది. ఇ.వి.ఎం గురించి తన ఆందోళనా స్వరాన్ని పెంచింది. అయితే, ఎన్నికల సమగ్రతకు సంబంధించి ఈవీఎం అంశం ఒక్కటే లేదు. ఇంకా చాలా అంశాలున్నాయని కాంగ్రెస్ తెలుసుకోవాలి. వాటి పట్ల భారత ఎన్నికల సంఘం స్వచ్ఛంగా వుండాల్సిన అవసరముంది. వీటిపై మాట్లాడాల్సిన అవసరం చాలా ఉంది. వాస్తవానికి ఇ.వి.ఎం లను ఎలక్ట్రానిక్ ట్యాంపరింగ్ చేసే ముప్పు ఈ జాబితాలోకి రాదు. కాంగ్రెస్ ఓ తప్పుడు అంశంపై గొంతెత్తుతోంది. అది కూడా ఎంపిక చేసుకున్న అంశాలపైనే, అందులోనూ ఓడిపోయిన వాటిపైనే మాట్లాడుతోంది. ఇ.వి.ఎం లకు సంబంధించి అవకతవకల ముప్పు వుందని సూచించేలా పరోక్షంగా లేదా ముందుగానే ప్రోగ్రామింగ్ చేయడం ద్వారా ట్యాంపరింగ్ జరిగి వుంటుందన దానికి ఎలాంటి ఆధారాలు లేవని కాంగ్రెస్ నేతలే కొందరు బహిరంగంగా అభిప్రాయపడ్డారు. ఇద్దరు ప్రతిపక్ష నేతలు నేషనల్ కాన్ఫరెన్స్ నేత, జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ కూడా ఈ ఆరోపణలతో తమకు సంబంధం లేదని విడగొట్టుకున్నారు. ఇ.వి.ఎం లలో చాలా కచ్చితంగా, తెలివిగా అవకతవకలకు పాల్పడ్డారని భావించేందుకు వీల్లేదు. ఎందుకంటే, కొన్ని రాష్టాల్లో బిజెపి విజయం సాధించింది, మరికొన్ని రాష్టాల్లో ఓడిపోయింది. కాబట్టి ఇక్కడ ఆ లాజిక్ పని చేయడం లేదు. ఇదంతా కాకపోయినా 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజారిటీని సాధించలేకపోయింది. పైగా, ఈ ఫలితాలన్నీ మరీ ముఖ్యంగా హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్ ఫలితాలు సామాజిక, రాజకీయ సమీకరణలు ఎలా పనిచేసినవో సరిగానే వివరించాయి.ఇ.వి.ఎం లలో అవకతవకల గురించి పదే పదే లేవనెత్తడం ద్వారా ఎన్నికల సమగ్రతకు సంబంధించిన నిజమైన, తీవ్రమైన అంశాలు వెనక్కి పోతున్నాయి. ప్రతిపక్షాల పోలింగ్ ఏజెంట్లు లేని పోలింగ్ బూత్‌లలో, ఒక పార్టీ ఆధిపత్యమే వున్న చోట ఇ.వి.ఎం లను ఎత్తుకుపోవడానికి గల అవకాశాలనేవి వాటిలో ఒకటి. పోలింగ్ ముగిసే సమయంలో చాలా చోట్ల పెద్ద ఎత్తున ఓటింగ్ శాతం నమోదు కావడంపై ప్రశ్నలు తలెత్తుతున్న నేపథ్యంలో ఇది సందర్భోచితమైన అంశంగా వుంది. ఈ ధోరణిని ఎన్నికల కమిషన్ సంతృప్తికరమైన రీతిలో వివరించడం లేదు. దీనికి తోడు పెద్ద ఎత్తున ఓటర్ల పేర్లు నమోదు కావడం, తొలగించడమనేది కూడా ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తోన్న ధోరణిగా వుంది. ఎన్నికల కమిషన్ దీన్ని పెద్దగా పట్టించుకోనట్లు కనిపిస్తోంది. ఫిబ్రవరిలో ఎన్నికలు జరగనున్న ఢిల్లీలో, ముస్లిం



ఓటర్ల పేర్లను ఎంపిక చేసి మరీ తొలగించినట్లు ఆరోపణలున్నాయి. యు.పి ఉప ఎన్నికల్లో, బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేస్తారని ఊహించిన ఓటర్లను నిలువరించేందుకు పోలీసులు పక్షపాతంతో వ్యవహరించడం వివాదాస్పదమైంది. ఇక ఎన్నికల షెడ్యూలు అనేది మరో తీవ్రమైన అంశం. ఎన్నికల కమిషన్ దీనిపై పారదర్శకంగా వ్యవహరించడం లేదు. దేశంలో, రాష్టాల్లో ఒకేసారి ఎన్నికలను నిర్వహించేందుకు సమాయత్తమవుతున్న దేశం ఇటీవల మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను రెండు విడతలుగా నిర్వహించింది. దీనివల్ల లబ్ది పొందింది బిజెపి మాత్రమే. ఈ అంశాల్లో కొన్ని స్థానికమైనవి, మరికొన్ని బిజెపి, ప్రతిపక్షం మధ్య గల సామర్థ్య అంతరం భారీగా వుండడానికి సంబంధించినవి. మరికొన్ని ఎన్నికల కమిషన్ కోర్టులో వున్నవి. ఎన్నికల సమగ్రతకు సంబంధించిన వాస్తవిక అంశాలపై ప్రతిపక్షం దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం వుంది. అంతేకానీ ఇ.వి.ఎం లపై భయాలు ఈ వాస్తవిక అంశాలను మరుగుపరిచేవిగా వుండకూడదు.

## టెక్నాలజీ బంధాలను

# దూరం చేస్తోందా?



టెక్నాలజీ బంధాలను బలోపేతం చేస్తోందా, మనుషులను దూరం చేస్తోందా అనేది మిలియన్ డాలర్ ప్రశ్న. ఆధునిక టెక్నాలజీ ప్రపంచాన్ని అరచేతిలో పెట్టేస్తోంది. కానీ, మన చిన్న ప్రపంచాన్ని మాత్రం కొన్ని మైళ్ల దూరానికి తీసుకుపోతోంది. మునపటి తరానికి ప్రస్తుత తరానికి ఆలోచనలు, ఆచరణలో చాలా తేడా వుంది. దీనికి ప్రధాన కారణం టెక్నాలజీ అని చెప్పవచ్చు. తరానికి తరానికి మధ్య ఈ తేడా ఉండటం సహజమే కానీ. కానీ ఈ సహస్రాబ్ది జనరేషన్ స్పీడ్ మామూలుగా లేదు. పాతిక, ముప్పయ్ ఏళ్ల క్రితం మొబైల్ ఫోన్లు లేవు, స్కూలు, కాలేజీ నుంచి ఇంటికి వచ్చి అమ్మా నాన్నలతోనే గడిపేవారు. ఇప్పటిలా ఇంట్లో వేర్వేరు గదులు లేవు. హాల్‌లోనే చదువులు ఉండేవి. పిల్లలు రహస్యంగా ఏ పని చేయాలన్నా కష్టంగానే ఉండేది. తల్లిదండ్రులు, ఇంట్లో పెద్దవాళ్లు ఓ కంట కనిపెట్టేవారు. పిల్లలు తల్లిదండ్రుల మాటకు చాలా విలువ ఇచ్చేవాళు . కానీ ఇప్పుడు, 13, 14 ఏళ్లకే పిల్లల చేతికి మొబైల్ ఫోన్ వస్తోంది. స్కూలులో పాఠాలు నేర్చుకోవడానికి, రీసెర్చ్‌కి మొబైల్ ఫోన్ లేకపోతే ఎలా అని అడగడంతో, తోటి పిల్లల దగ్గర ఎక్కడ తక్కువైపోతారో, చదువులో ఎక్కడ వెనకబడిపోతారో అనే భయంతో తల్లిదండ్రులు పిల్లల చేతిలో స్మార్ట్ ఫోన్ పెట్టక తప్పట్లేదు. మొబైల్ చేతిలోకొచ్చాక వాళ్ల స్నేహాలు ఎవరితో ఎలా ఉంటున్నాయో అంచనా వేయలేరు. సైబర్ నేరాలు, సైబర్ మోసాలు, ఆడపిల్లలను మోసం చేయడం, అపరిచితులతో స్నేహాలు, డేటింగ్ ఇవన్నీ మొబైల్ ఫోన్ల వల్ల పెరుగుతున్నాయి. టెక్నాలజీ చేతుల్లోకి రాగానే, ప్రపంచం చేతుల్లోకి వచ్చేసింది. గత తరంలో పిల్లలు తమకు తెలియని విషయాల గురించి పెద్దవాళ్లను ప్రశ్నలు అడిగేవారు. ఇప్పుడు గూగుల్ తల్లిని అడుగుతున్నారు. ఫోన్లు, టీవీలు పిల్లలకు ఫ్రెండ్స్‌గా మారిపోయాయి. ఇంటికి చుట్టాలు, స్నేహితులు వస్తే, వాళ్లతో గడపడానికి, కనీసం ఐదు నిమిషాలు పలకరించేందుకు కూడా ఈ తరం పిల్లలకు ఓపిక ఉండటం లేదు. అవతలి వ్యక్తులు మాట్లాడుతుంటే, వీళ్లు ఫోన్లు చూసుకుంటూ, ఇంటికొచ్చిన వారి పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇది పేరెంట్స్ పెంపకం తప్పో, టెక్నాలజీ తప్పో అర్థం కాని పరిస్థితి. ఇక, ఇంట్లో అందరూ కలిసి భోజనం చేసే సంస్కృతి ఎప్పుడో పోయింది. దీంతో, కుటుంబ సభ్యుల మధ్య మాటలే కరువయ్యాయి. డబ్బులు కావాలంటే మాత్రం ప్రేమగా ఓ ఐదు నిమిషాలు మాట్లాడతారు. ప్రతి బంధాన్నీ ఓ డీల్‌లా చూడటం అలవాటైపోయింది. మానవ సంబంధాలు యాంత్రికంగా మారిపోయాయి. అసాధారణ ప్రవర్తనను ఈ జనరేషన్ సాధారణం చేశారు. ఐతే, ఈ తరం వారు దీర్ఘ కాలంలో ఒత్తిడికి, అసహనానికి లోనయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. క్షణకాలపు ఆకర్షణలో ఏర్పడే పరిచయాలకు శాశ్వతత్వం ఉండదు.

ఆన్‌లైన్ చాట్‌లు, కొన్ని రోజులు గడిపిన తర్వాత గొడవలు సాధారణం అయ్యాయి. సైబర్ సైకాలజీ, బిహేవియర్ అండ్ సోషల్ నెట్ వర్కింగ్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనంలో ఆన్‌లైన్‌లో కలిసిన జంటల సంబంధాలు ఆఫ్‌లైన్‌లో కలిసిన వారి కంటే భిన్నంగా ఎలా ఉంటాయనే అంశాలను పరిశీలించింది.ఈ అధ్యయనంలో ఆన్‌లైన్ డేటింగ్‌లో ఏర్పడే సంబంధాలు విఫలమవుతాయని, బలహీనంగా ఉంటాయని చెప్పడం తప్పు అని అధ్యయనకారులు పేర్కొన్నారు. నేటి యువత సంబంధాలను ఏర్పరచుకోవడంలో, నిర్వహించడంలో టెక్నాలజీ కీలకమైన మార్పులు తీసుకువచ్చింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ లాంటి సోషల్ మీడియా ఎ÷-లాట్ ఫారాలు వాట్సాప్, సిగ్నల్ లాంటి మెసేజింగ్ అప్లికేషన్లు తక్షణ కనెక్టివిటీని అందిస్తున్నాయి. దూరంతో సంబంధం లేకుండా సులువుగా కమ్యూనికేట్ చేయడానికి, కొత్త స్నేహాలను ఏర్పరచుకోవడానికి సహాయపడుతున్నాయి.మరోవైపు ఈ కనెక్టివిటీని అధికంగా ఉపయోగించడం నిజమైన బంధాలకు ఆటంకంగా మారవచ్చు. ఒంటరితనం, అసంతృప్తికి కారణం కావచ్చు. మితిమీరిన స్క్రీన్ టైం వంటి అంశాలు ముఖాముఖి సంబంధాలను తగ్గిస్తాయి. దీనివల్ల సోషల్ స్కిల్స్, ఎమోషనల్ స్కిల్స్ మందగించవచ్చు. కాబట్టి, టెక్నాలజీని బ్యాలెన్స్‌గా వాడుకోవాలని యువత గుర్తించాలని అంటున్నారు సైకాలజిస్టులు.

## ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఖర్చు కూడా ఒక ఖర్చేనా?

ఎన్నికలనేవి ప్రజాస్వామ్యంలో పండుగ వంటివి. పండగ ఖర్చును చూసి ఎవరూ భయపడరు. ఉన్నవాడు లేని వాడు అంతా తమకు ఉన్న దాంట్లో పండగ చేసుకుంటారు. అలాంటి ప్రజాస్వామ్య పండుగకు ప్రభుత్వం చేసే ఖర్చును బూచీగా చూపించి మోడీ సర్కార్ జమిలీ ఎన్నికలను ముందుకు తెచ్చింది. నిజానికి ఖర్చు మాట పైకి చెబున్నది. లోగుట్టు వేరే. ప్రపంచంలో ఐదవ పెద్ద ఆర్థిక వ్యవస్థలో ఎన్నికల ఖర్చు కూడా ఒక ఖర్చేనా అనిపిస్తుంది సామాన్యుడికి సైతం. ఎన్నికల ఖర్చు ఆదా అంటే.. అది ఎన్నికల నిర్వహణ ఖర్చు ఆదానా లేక రాజకీయ పార్టీలు పెట్టే ఖర్చులు తగ్గించుకునేందుకా! లోక్ సభ ఎన్నికలు ఒక సారి, అసెంబ్లీ ఎన్నికలు ఒక సారి వస్తే.. రెండు సార్లు నేతలు ఓటుకు నోటు ఇవ్వాలి, ప్రచారానికి భారీగా ఖర్చు పెట్టాలి, మందు ముక్క కు ఖర్చు పెట్టాలి.. అదే ఒకేసారి ఎన్నికలు వచ్చేస్తే ఖర్చులో ఖర్చు తగ్గిపోతుంది! అసెంబ్లీ ఎన్నికలకు, లోక్ సభ ఎన్నికలకు రెండు సార్లు నోటు ఇవ్వాల్సిన పని ఉండదు, ఇక ప్రచార ఖర్చు అయితే మరింతగా తగ్గిపోతుంది! బహుశా నేతలకు ఒకేసారి ఖర్చు చేసి ఐదేళ్ల పాటు ఇష్టానుసారం వ్యవహరించుకోవ డానికే ఈ జమిలి ఎన్నికల ఆలోచన కాబోలు! అయితే ఈ మాత్రం ఆలోచన, ఈ మాత్రం జ్ఞానం అమెరికా వంటి దేశానికి ఎందుకు లేదో మరి. అక్కడి ప్రతి నాలుగేళ్లకూ ఒకసారి ఎన్నికలు పెట్టుకున్నారు. శతాబ్దాల నుంచి అలాగే కొనసాగిస్తూ ఉన్నారు! మన దగ్గర ప్రధానికి అవకాశం ఐదేళ్లు, ముఖ్యమంత్రికి అవకాశం ఐదేళ్లు.. అన్ని ప్రజాస్వామ్య బద్ధ పదవులకూ ఐదేళ్ల కాలాన్ని ఇచ్చింది భారతరాజ్యాంగం. అమెరికాలో మరీ నాలుగేళ్లే అవకాశం. ఐదేళ్లతో పోలిస్తే నాలుగేళ్లు ఒక ఏడాది ముందుగానే గడిచిపోతాయి. సర్దుకోవడానికి ఏడాది పడుతుంది, చివరి ఏడాది ఎన్నికల ఏడాది. మధ్యలో మిగిలింది రెండేళ్ల సమయమే.. అయితే ఏ అమెరికన్ ప్రెసిడెంట్ కూడా నాలుగేళ్లు మరీ తక్కువ కాలం, దాన్ని ఐదేళ్లు చేయాలనో, ఆరేళ్లు చేయాలనో వాదించలేదు! అలా తమ పదవీ కాలాన్ని పెంచుకునే ప్రయత్నాలనూ చేయలేదు! ఎన్నికల ఖర్చు గురించి తెగ బాధపడిపోతూ ఇప్పుడు భారత ప్రభుత్వం ఒక దేశం ఒక ఎన్నికలు అంటూ వాదిస్తూ ఉంది. అయితే ఏదైనా 'ఒకే' అనేది భారత్‌కు వర్తింపచేయటం చాలా కష్టం. అసలు కుదరదు. ఎందుకంటే మనది భిన్నత్వం! భిన్నత్వంలో ఏకత్వమే భారత ప్రజాస్వామ్యానికి ఊపిరి పోస్తూ వచ్చింది. అయితే మరీ ముఖ్యంగా 2014 నుంచి ఒకటే ఒకటే.. అనే మాట బాగా వినిపిస్తూ ఉంది. ఒకటే భాష, ఒకటే మతం, ఒకటే పౌరసత్వం, ఒకటే ఎన్నిక.. ఇలాంటి వాదనలు ముఖ్యమైన పదవుల్లోని వారి నుంచి వినిపిస్తూ ఉన్నాయి. ఒక్కొక్కటిగా సాధించుకుంటూ ఉన్నారు! మరి ఇప్పుడు ఒకేసారి ఎన్నికలు జరిగిపోతే ఆ తర్వాత ఐదేళ్లు ఇక ఏం చేసినా అడిగే వారు ఉండరనా!దమొన్నటి వరకూ మోడీజీకి చాలా కష్టం ఉండేది

. కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికలంటే కర్ణాటక చుట్టూ నెల రోజుల పాటు తిరగాలి, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలంటే మహారాష్ట్ర కు తనే సీఎం అభ్యర్థిని అన్నట్టుగా ప్రచారం చేయాలి.. ఇలా దేశంలో ఎక్కడ అసెంబ్లీ ఎన్నికలు వచ్చినా.. ప్రధానిగా కన్నా.. ఆ రాష్ట్రానికి తనే సీఎం క్యాండిడేట్ అన్నట్టుగా మోడీ ప్రచారం చేసి పెట్టే వాళ్లు! మరి ఈ ఇబ్బంది వద్దనే.. ఒక దేశంలో అన్ని రాష్ట్రాలకూ, అన్ని లోక్ సభస్థానాలకూ ఎన్నికలు జరిగేస్తే? ఆ తర్వాత మోడీ కి ఇలా ముఖ్యమంత్రి అభ్యర్థి తరహాలో ప్రచారం చేయాల్సిన అవసరం తప్పుతుంది! ఇక ఆయన ఎంచక్కా ప్రధానిగా తన పనుల్లో మునిగిపోవచ్చు. అలాగే యూపీ అసెంబ్లీ ఎన్నికలంటే పెట్రో ధరలను పెంచకుండా కొన్నాళ్లు ఓపిక పట్టే వారు, ఎన్నికల షెడ్యూల్ వచ్చిన రోజు నుంచి పోలింగ్ ముగిసే రోజు వరకూ ధరల హెచ్చులు ఉండేవి కావు. అలాగే కొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలున్నప్పుడు కొన్ని ప్రజాకర్షక పథకాలు ఉండేవి. ఇక వాటి అవసరం కూడా ఉండదు. ఎలాగూ దేశమంతా ఐదేళ్లకు ఒకసారి అన్ని ఎన్నికలూ అయిపోతాయి కాబట్టి? ఇక ఆ రెన్నాళ్లూ ప్రజాకర్షక పథకాలు అమలు చేస్తే చాలు, ఆ తర్వాత ఐదేళ్లూ ఆడింది ఆట, పాడింది పాట! కార్పొరేట్లకు వంత పాడుకోవచ్చు , సామాన్య ప్రజలు మరో ఐదేళ్ల వరకు సైలెంట్‌గా మూలనపడి ఉంటారు.

## పెరుగు, కీరా.. ఫహాడీ రైతా.. అరగంట ఫ్రిజ్‌లో సర్వ్ చేసుకుంటే!

పెరుగు, కీరా కలగలసిన ఫహాడి రైతా తయారీ విధానం తెలుసా?



### ఫహాడి రైతా తయారీకి కావల్సినవి

పెరుగు రెండు కప్పులు,కీరా ఒకటి,ఆవాలు టీస్పూను,పచ్చిమిర్చి రెండు,ఆవ నూనె పావు కప్పు,కొత్తిమీర గుప్పెడు,కారం టీస్పూను,పసుపు అరటీస్పూను,ఉప్పు రుచికి సరిపడా.

### తయారీ...

తొక్క, గింజలు తీసిన కీరాను సన్నగా తురిమి పక్కన పెట్టుకోవాలి.పెరుగును పెద్దగిన్నెలో వేసి కవ్వంతో చిలకాలి.
తరువాత పావు కప్పు నీళ్లుపోసి కలపాలి.ఇప్పుడు ఆవాలు, పచ్చిమిర్చి, రుచికి సరిపడా ఉప్పు వేసి కచ్చాపచ్చాగా దంచుకోవాలిదంచిన మిశ్రమం, కీరా తరుగుని చిలికిన పెరుగులో వేయాలి.పసుపు, కారం కూడా వేసి చక్కగా కలుపుకోవాలి.దీనిని అరగంటపాటు రిఫ్రిజిరేటర్‌లో పెట్టి తరువాత సర్వ్ చేసుకోవాలి.

# ఉత్తరాఖండ్ వంటకం

## ఆలుకీ గుట్కే తయారీ ఇలా!

### ఆలుకీ గుట్కే



ఉత్తరాఖండ్ వంటకం ఆలుకీ గుట్కే ఇలా తయారు చేసుకోండి.
**ఆలుకీ గుట్కే తయారీకి కావలసినవి:**బంగాళ దుంపలు మూడు,ఆవనూనె రెండు టీస్పూన్లు,కారం పావు టీస్పూను,ధనియాలపొడి రెండు టీస్పూన్లు,జీలకర్ర పావు టీస్పూను,పసుపు పావు టీస్పూను,ఎండు మిర్చి రెండు,ఇంగువ రెండు చిటికెలు,ఉప్పు రుచికి సరిపడా,కొత్తిమీర తరుగు గార్నిష్‌కు సరిపడా.
**తయారీ...:**కొద్దిగా ఉప్పువేసి బంగాళ దుంపలను ఉడికించాలి.ఉడికిన దుంపల తొక్క తీసి ముక్కలు తరగాలి.చిన్న గిన్నెలో ధనియాల పొడి, కారం, పసుపు, రెండు టీస్పూన్ల నీళ్లుపోసి చక్కగా కలపాలి.స్టవ్ మీద మందపాటి బాణలి పెట్టి నూనె వేయాలి. నూనె కాగాక జీలకర్ర, ఇంగువ, కారం వేసి అరనిమిషం పాటు వేయించాలి.ఇప్పుడు బంగాళ దుంపల ముక్కలు, కలిపి పెట్టుకున్న మసాలా మిశ్రమం, రుచికి సరిపడా ఉప్పు వేసి ఐదు నిమిషాలపాటు వేయించాలి.చివరిగా కొత్తిమీర చల్లుకుని దించేయాలి.

# శుక్లం శాపం,

## దృష్టి లోపం.. కారణాలు, లక్షణాలు, చికిత్స

కంటిశుక్లం అత్యంత విలువైన కంటి చూపును తగ్గించే తీవ్రమైన సమస్య. దీనిపై ప్రజలలో ఇంకా అవగాహన పెరగాల్సి ఉంది. ఇది నిదానంగా పెరిగే సమస్య కావడం వల్ల చాలామంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. తద్వారా సమస్య తీవ్రత పెరిగేందుకు కారణమవుతున్నారు. ఈ నేపథ్యంలో కంటి శుక్లం శస్త్రచికిత్స/క్యాటరాక్ట్ ఆపరేషన్ అవసరం...పై అపోలో స్పెక్ట్రా ఆసుపత్రికి చెందిన వైద్యులు, ప్రముఖ క్యాటరాక్ట్ సర్జన్ డా. అల్వా అతుల్ పూర్బియా అందిస్తున్న సమాచారం ఇది...కంటి శుక్లం..కారణాలు...కంటి లెన్స్ పుట్టుకతో స్పష్టంగా ఉంటుంది, ప్రధానంగా నీరు మరియు ప్రోటీన్లతో కూడి ఉంటుంది. ప్రోటీన్లు కాలక్రమేణా విచ్ఛిన్నం కావడంతో, లెన్స్ తెల్లగా లేదా బూడిద రంగులోకి మారడం ప్రారంభిస్తుంది, ఇది స్పష్టమైన చూపును నిరోధిస్తుంది. దీనికి సాధారణంగా వయస్సు పెరగడం కాగా, అతినీలలోహిత కిరణం/సూర్య కాంతికి గురికావడం వంటివి కూడా కంటిశుక్లంను ప్రేరేపించడానికి కారణాలే. ఇక ఇతర కారణాలలో అతిగా ధూమపానం, దీర్ఘకాలిక మధుమేహం, దీర్ఘకాలిక స్టెరాయిడ్స్ వాడకం వంటివి కూడా ఉండవచ్చు. అలాగే ఆల్కహాల్ దుర్వినియోగం, ఊబకాయం, రేడియేషన్ థెరపీ మొదలైనవి కూడా ఉన్నాయి. ప్రమాదవశాత్తు కంటికి అయిన గాయాలు కూడా కంటిశుక్లం వృద్ధికి కారణం కావచ్చు. కొన్ని సార్లు పుట్టుకతో కూడా కంటిశుక్లం వచ్చే అవకాశం ఉంది. చాలా అరుదుగా పిల్లలలో అభివృద్ధి చెందే కంటిశుక్లంని డెవలప్‌మెంటల్ క్యాటరాక్ట్ అంటారు.గుర్తించాల్సిందే...కంటిశుక్లం నిదానంగా అభివృద్ధి చెందే గుణం కలిగి ఉంటుంది కాబట్టి ముందుగా జాగ్రత్త పడడం కష్టమవుతుంది. దీనిని ముందుగా గుర్తించడానికి రాత్రిపూట దృష్టికి అంతరాయం, తక్కువ కాంతిలో చూడటం కష్టతరం అవడం వంటి లక్షణాలు ఉపకరిస్తాయి. కంటి శుక్లం ఉన్న రోగులు సాధారణంగా లైట్ చుట్టూ ఒక కాంతిని చూస్తారు. అలాగే కంటి శుక్లం ఉన్నప్పుడు ప్రకాశవంతమైన లైట్ల మెరుపు బాధాకరంగా ఉంటుంది, కంటిశుక్లం ఉన్న వ్యక్తులు ప్రకాశవంతమైన సూర్యకాంతిలో సరిగ్గా చూడటం కష్టంగా ఉండవచ్చు లేదా రాత్రి సమయంలో కొన్నిసార్లు మరింత చెదిరిన దృష్టిని గమనించవచ్చు. వారికి ఇండోర్ లైట్లలో కూడా చూపు కష్టంగా ఉండవచ్చు. వీధి లైట్లు



ఎదురుగా వచ్చే వాహనాల నుండి వచ్చే హెడ్‌లైట్ల వల్ల కలిగే కాంతి కారణంగా రాత్రి సమయంలో డ్రైవింగ్ సమస్యగా మారవచ్చు. కంటిశుక్లం బాగు చేసేందుకు మందులతో చేయగలిగిన వైద్య చికిత్స లేదు. మసకబారిన చూపును, దృష్టిని పునరుద్ధరించడానికి శస్త్రచికిత్స ద్వారా కంటిశుక్లం తొలగించడమే మార్గం. . కంటిశుక్లం లక్షణాలు స్వల్పంగా ఉన్నట్లయితే, అద్దాలు లేదా కాంటాక్ట్ లెన్స్ అవసరం కావచ్చు, కానీ కాలక్రమేణా కంటిశుక్లం మరింత తీవ్రమవుతుంది. తర్వాత తర్వాత సాధారణ రోజువారీ కార్యకలాపాలకు కూడా ఇది ఆటంకం కలిగిస్తే శస్త్రచికిత్స చేయక తప్పదు. కంటిశుక్లం తొలగింపు శస్త్రచికిత్స ప్రక్రియను ఇంట్రాకోక్యులర్ లెన్స్ ఇంప్లాంటేషన్స్ తో ఫాకోఎమల్సిఫికేషన్ అంటారు. ఈ ప్రక్రియలో, కంటిశుక్లం వృద్ధి చెందిన అసలు లెన్స్, కృత్రిమ (ఇంట్రాకోక్యులర్ లెన్స్)తో భర్తీ చేయబడుతుంది. ఇది చాలా సురక్షితమైన ప్రక్రియ. ఈ శస్త్రచికిత్స తర్వాత కొన్ని రోజుల పాటు దురద, తేలికపాటి అసౌకర్యం కంటిలో నీరు కారడం వంటివి కనిపించవచ్చు.అయితే నేడు అందుబాటులో ఉన్న తాజా సాంకేతికతతో విజువల్ రికవరీ చాలా వేగంగా ఉంది. శస్త్రచికిత్స తర్వాత కోలుకునే కాలం ఒకరి నుండి మరొకరికి భిన్నంగా ఉండవచ్చు. కొంతమంది కొద్ది రోజుల్లోనే సాధారణ స్థితికి చేరుకుంటారు, మరికొందరికి కోలుకోవడానికి వారాలు పడుతుంది. ఇతరత్రా సమస్యలు లేనట్లయితే వైద్యులు ఒక వారం విశ్రాంతిని సిఫార్సు చేస్తారు. సాధారణంగా అయితే కొన్ని గంటలలోపే, కంటిలో కాలుష్యం లేదా ధూళి కణాలు ప్రవేశించకుండా నిరోధించడానికి రోగిని రక్షించే గ్లాస్ లేదా కంటికి ఐ ప్యాడ్‌తో ఇంటికి తిరిగి పంపుతారు.

## వంట నూనెను మళ్లీ మళ్లీ వాడుతున్నారా?

# ఎంత డేంజరో తెలుసా..

పెదవాల్తేరు(విశాఖపట్నం): ఇంట్లోను, హోటళ్లలోను ఒకసారి వినియోగించిన వంట నూనెను పదేపదే ఉపయోగించడం పరిపాటి. కానీ అలా చేయడం ఆరోగ్యానికి హానికరం అన్న విషయం చాలా మందికి తెలియదు. దీనిపై ఇప్పుడిప్పుడే అధికారులు కూడా అవగాహన కల్పిస్తున్నారు. వాడిన వంటనూనెతో తయారైన ఆహారం తీసుకోవడం ద్వారా గుండెజబ్బులు, లివర్ జబ్బులు, హైపర్‌టెన్షన్, అల్జీమర్ వంటి వ్యాధులు సోకుతాయని జిల్లా ఆహార భద్రత శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.చదవండి: మీకు తెలుసా?.. విద్యుత్ శాఖ నుంచి మెసేజ్‌లు రావు .కేంద్ర ప్రభుత్వం ఆమోదం పొందిన ఎన్ఎస్ఆర్ ఇండస్ట్రీస్ ఒకసారి వాడిన వంట నూనెను కొనుగోలు చేస్తుంది. ఇప్పటికే విశాఖలోని పలు హోటళ్లలోను, గేటెడ్ కమ్యూనిటీ, అపార్ట్‌మెంట్లలోను వాడిన వంటనూనె సేకరణ కోసం డ్రమ్ములు కూడా ఏర్పాటు చేశారు. లీటర్ అయిల్‌కు రూ.30 వంతున చెల్లిస్తారు. అపార్ట్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, హోటల్ యజమానులు వాడిన వంటనూనె విక్రయాల కోసం సదరు సంస్థను సంప్రదించాలని ఆహార భద్రత శాఖ అధికారులు కోరుతున్నారు. ఈ నూనె సాయంతో బయోడీజిల్ తయారు చేస్తారు. ఫలితంగా పెరుగుతున్న చమురు ధరల నుంచి ఉపశమనం పొందవచ్చని అధికారులు చెబుతున్నారు.



# ఆరిక అన్నం అత్యంత

## బలవర్ధకమైన, ఔషధ గుణాలున్న ఆహారం..

ఆరిక అన్నం ఇంటిల్లపాదికీ అత్యంత బలవర్ధకమైన, ఔషధ గుణాలున్న ఆహారం. ఖరీఫ్‌లో మాత్రమే సాగయ్యే చిరుధాన్య పంట ఆరిక మాత్రమే. ఆరిక 160–170 రోజుల పంట. విత్తిన తర్వాత దాదాపు 6 నెలలకు పంట చేతికి వస్తుంది. ఆరికలు విత్తుకోవడానికి ఆరుద్ర కార్తె (జూలై 5 వరకు) అత్యంత అనువైన కాలం.మొలిచిన తర్వాత 40–50 రోజులు వర్షం లేకపోయినా ఆరిక పంట నిలుస్తుంది. ఇతర పంటలు అంతగా నిలవ్వు. చిరుధాన్యాల్లో చిన్న గింజ పంటలు (స్మాల్ మిల్లెట్స్).. ఆరిక, కొర్ర, సామ, ఊద, అండుకొర్ర. ఆరిక మినహా మిగతా నాలుగు పంటలూ 90–100 రోజుల్లో పూర్తయ్యేవే.చిరుధాన్యాల సేంద్రియ సాగులో అనుభవజ్ఞుడు, వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన రైతు శాస్త్రవేత్త కొమ్మూరి విజయకుమార్ 'సాక్షి సాగుబడి'కి వివరించారు. సేంద్రియ పద్ధతుల్లో ఆరికల సాగులో మెలకువలను ఆయన మాటల్లోనే ఇక్కడ పొందుపరుస్తున్నాం...ఆరిక విత్తనాలు ఒక్క వర్షం పడి తేమ తగలగానే మొలుస్తాయి. ఒక్కసారి మొలిస్తే చాలు. గొర్రెలు తిన్నా మళ్లీ పెరుగుతుంది ఆరికె మొక్క. మొలిచిన తర్వాత దీర్ఘకాలం వర్షం లేకపోయినా తట్టుకొని బతకటం ఆరిక ప్రత్యేకత. మళ్లీ చినుకులు పడగానే తిప్పుకుంటుంది. అందువల్ల సాధారణ వర్షపాతం కురిసే ప్రాంతాలతో పాటు అత్యల్ప వర్షపాతం కురిసే ప్రాంతాలకూ ఇది అత్యంత అనువైన పంట. నల్ల కంకి సమస్యే ఉండదు. ఆరిక పంటకు రసాయనిక ఎరువులు, పురుగుమందులు అవసరం లేదు. పొలాన్ని దుక్కి చేసుకొని మాగిన పశువుల దిబ్బ ఎరువు ఎకరానికి 4–5 ట్రాక్టర్లు(12 టన్నులు) వెదజల్లాలి. లేదా గొర్రెలు, మేకలతో మందగట్టడం మంచిది. గొర్రెలు, మేకలు మూత్రం పోసిన చోట ఆరిక అద్భుతంగా దుబ్బు కడుతుంది. శ్రీవరి సాగులో మాదిరిగా 30–40 పిలకలు వస్తాయి. పొలాన్ని దుక్కి చేసి పెట్టుకొని.. మంచి వర్షం పడిన తర్వాత ఆరికెలను విత్తుకోవాలి. వెదజల్లటం కన్నా గొర్రుతో సాళ్లుగా విత్తుకోవడం మంచిది. గొర్రుతో విత్తితే విత్తనం సమాన లోతులో పడుతుంది. ఒకరోజు అటూ ఇటుగా మొలుస్తాయి. ఒకేసారి పంటంతా కోతకు వస్తుంది. 8 సాళ్లు ఆరికలు విత్తుకొని, 1 సాలు కందులు, మళ్లీ 8 సాళ్లు ఆరికలు, ఒక సాలు ఆముదాలు విత్తుకోవాలి. ఎకరానికి 3 కిలోల ఆరిక విత్తనం కావాలి. కంది విత్తనాలు ఎకరానికి ఒకటిన్నర కిలోలు కావాలి. కిలోన్నర కందుల్లో వంద గ్రాములు సీతమ్మ జొన్నలు, 50 గ్రాములు తెల్ల / చేను గోగులు కలిపి విత్తుకోవాలి. ఎకరానికి 3 కిలోల ఆముదం విత్తనాలు కావాలి. ఎకరానికి పావు కిలో నాటు అలసందలు /బొబ్బర్లు, అర కిలో అనుములు, వంద గ్రా. చేను చిక్కుళ్లు ఆముదాలలో కలిపి చల్లుకోవాలి. ఆరికలు విత్తుకునేటప్పుడు కిలో విత్తనానికి 4 కిలోల గండ్ర ఇసుక కలిపి విత్తుకోవాలి. ఆరికల విత్తనాలు ఎంత సైజులో ఉంటాయో అదే సైజులో ఉండే ఇసుక కలిపి గొర్రుతో విత్తుకోవాలి. కందులు, ఆముదం తదితర విత్తనాలను అక్కిలి / అక్కిడి కట్టెలతో విత్తుకోవాలి. ఆరికలను మిశ్రమ సాగు చేసినప్పుడు పెద్దగా చీడపీడలేమీ రావు. కషాయాలు పిచికారీ చేయాల్సిన అవసరం రాదు.ఐదారు రకాల పంటలు కలిపి సాగు చేయడం వల్ల చీడపీడలు నియంత్రణలో ఉంటాయి. రైతు కుటుంబానికి కావాల్సిన అన్ని రకాల పంటలూ చేతికి వస్తాయి. ఆహార భద్రత కలుగుతుంది. కంది, సీతమ్మ జొన్న తదితర పంట మొక్కల పిలకలు తుంచేకొద్దీ మళ్లీ చిగుర్లు వేస్తూ పెరుగుతాయి. పక్షి స్థావరాలుగా కూడా ఇవి ఉపయోగపడతాయి. ఆరికలు ఎకరానికి ఎంత లేదన్నా 6–8 క్వింటాళ్లు, కందులు 3 క్వింటాళ్లు, ఆముదాలు 5 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. సందేహాలుంటే విజయకుమార్ (98496 48498)ను ఆంధ్రప్రదేశ్ రైతులు ఉ. 6–9 గం. మధ్యలో, తెలంగాణ రైతులు సా. 6–9 గం. మధ్య సంప్రదించవచ్చు.



# పంచదార, తేనె, ఆలివ్ ఆయిల్,

# నిమ్మ.. దెబ్బకు జిడ్డు వదులుతుంది!

### ఓజిగట వదిలించే స్క్రబ్

వర్షాకాలంలో పేరుకుపోయిన మృతకణాలతో ముఖం జిగటగా ఉంటుంది. ఈ జిగటను తొలగించే స్క్రబ్‌ను ఇంట్లోనే అత్యంత సులువుగా తయారు చేసుకోవచ్చు. అదెలాగో చూద్దాం...కప్పు పంచదారలో టీస్పూను తేనె, అరటీస్పూను నిమ్మరసం, టీస్పూను ఆలివ్ ఆయిల్ వేసి కలపాలి.

ఈ మిశ్రమాన్ని ముఖానికి పూతలా అప్లై చేసి ఆరిన తర్వాత సున్నితంగా మర్దన చేసి నీటితో కడిగేయాలి.వారంలో రెండు సార్లు ఈ స్క్రబ్ అప్లై చేయడం వల్ల జిగటపోయి ముఖచర్మం ఆరోగ్యంగా, కాంతిమంతంగా కనిపిస్తుంది.

### సహజమైన క్లెన్సర్స్

ముఖం మరీ మురికిగా అనిపిస్తే పాలు, మీగడ, పెరుగు, మజ్జిగ ఏది అందుబాటులో ఉంటే దానిని పట్టించి మెల్లగా రుద్దాలి. ఇవి సహజమైన క్లెన్సర్స్.మార్కెట్‌లో దొరికే క్లెన్సింగ్ మిల్క్‌కు బదులుగా వీటిని వాడవచ్చు.రోజూ మామూలుగా ముఖాన్ని శుభ్రం చేస్తున్నప్పటికీ దుమ్ముకణాలు చర్మం లోపలి గ్రంథుల్లోకి వెళ్లి చర్మానికి పట్టేస్తాయి.అలాంటప్పుడు కూడా ఈ క్లెన్సర్‌ను వాడవచ్చు.



# ఈ అమ్మాయిని చూసి...

## అడవి ముచ్చటపడింది!

పిల్లలు ఇష్టంగా చదువుకుంటుంటే పెద్దలే కాదు ప్రకృతి కూడా ముచ్చటపడుతుంది. నిండు మనసుతో ఆశీర్వదిస్తుంది!'నిద్ర సుఖం ఎరగదు' అంటారు. విద్య కూడా అంతే! ఏసీ గదులలో, మెత్తని సోఫాలలో కూర్చుని చదివితేనే చదువు వస్తుందని ఏమీ లేదు. ఇలా ఎండలో, రాళ్లపై కూర్చొని చదువుకుంటే కూడా చదువు వస్తుంది. అదంతా మన ఆసక్తిపై ఆధారపడి ఉంటుంది. విషయంలోకి వెళితే..హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఒక అమ్మాయి ప్రకృతి ఒడిలో పాఠ్యపుస్తకం చదువుకుంటున్న ఫోటో పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రాను బాగా ఆకట్టుకుంది. 'మన్‌డే మోటివేషన్స్' ట్యాగ్‌లైన్‌తో సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఈ ఇన్‌స్పిరేషనల్ పోస్ట్ నెటిజనులను బాగా ఆకట్టుకుంది.'ఈరోజు నేను హిమాచల్‌ద్రేశ్‌లోని సత్నా ప్రాంతానికి వెళ్లాను. అక్కడ చూసిన ఒక దృశ్యం నన్ను ఆశ్చర్యానందాలకు గురి చేసింది. ఒక అమ్మాయి శ్రద్ధగా చదువుకుటోంది. నోట్స్ రాసుకుంటోంది. పచ్చటి ప్రకృతి ఆమెను దీవిస్తున్నట్లుగా ఉంది. నిజం చెప్పాలంటే... ఈ దృశ్యాన్ని వర్ణించడానికి మాటలు దొరకడం లేదు' అంటూ రాసి మురిసిపోయాడు దూబే.'నిజానికి పిల్లలకు నాలుగు గోడల మధ్య కాకుండా పచ్చటి ప్రకృతి మధ్యే విద్య నేర్పించాలి. ఇలా చేస్తే వారికి ప్రకృతి విలువ తెలుస్తుంది. పర్యావరణ స్పృహ బాల్యం నుంచే కలుగుతుంది. గోడలు లేని బడిలో మనసు విశాలం అవుతుంది. తాత్విక విద్యావేత్తలు ఇదే విషయాన్ని చెప్పారు' అంటుంది ఒక యూజర్.పెద్దల పోరు భరించలేక చదువుకుంటున్నట్లు కాకుండా... చాలా ఇష్టంగా చదువుకుంటున్నట్లుగా ఉంది.



# భళా.. బాపట్ల బ్లాక్ రైస్!

బీపీటీ 2841 రకం నల్ల బియ్యం వంగడాన్ని బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. రోగనిరోధక శక్తిని పెంపొందించే యాంటీ ఆక్సిడెంట్లతో పాటు ఐరన్, జింక్ వంటి సూక్ష్మపోషకాలను పుష్కలంగా కలిగి ఉండటం.. పంట పడిపోకుండా ఉండటం, చీడపీడలను తట్టుకోవటం, ఎకరానికి 30–35 బస్తాల దిగుబడినివ్వటం దీని ప్రత్యేకతలు. రైతుల పొలాల్లో ప్రయోగాత్మకంగా సాగు చేయించగా వరుసగా మూడేళ్ల సత్ఫలితాలు వచ్చాయి. సేంద్రియ/ప్రకృతి సేద్యానికి అనువైన ఈ విశిష్ట వంగడం అధికారిక విడుదలకు సిద్ధమవుతోంది. ఆరోగ్యకరమైన ఆహారం గురించి వినియోగదారుల్లో ఇటీవల అవగాహన పెరగడం, ప్రజల కొనుగోలు శక్తి పెరగడం వలన పోషకాలు కలిగిన ఆహార పదార్థాల వాడకం పెరిగింది.

సేంద్రియ ఆహారోత్పత్తులపై కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నందున నలుపు, ఎరుపు దేశవాళీ వరి రకాల సాగు, వాడకం క్రమక్రమంగా పెరుగుతోంది. కోతకు ముందు పడిపోవటం, దిగుబడులు తక్కువగా ఉండటం వంటి సమస్యలను తట్టుకునే సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ పూర్వరంగంలో బాపట్ల వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు ఎకరానికి 30–35 బస్తాల దిగుబడినిచ్చే బీపీటీ 2841 బ్లాక్ రైస్ వంగడాన్ని అభివృద్ధి చేయటం విశేషం.



**130–140 రోజుల పంట** యం.టి.యు. 7029, ఐ.ఆర్.జి.సి. 18195, యం.టి.యు. 1081 అనే రకాల సంకరం ద్వారా బీపీటీ 2841 సన్న రకం బ్లాక్ రైస్ వంగడాన్ని శాస్త్రవేత్తలు రూపొందించారు. డా. బి. కృష్ణవేణి, డా. డి. సందీప్ రాజా, డా. సి.వి. రామారావు, డా. వై. సునీత, డా. కె.ఎ. మృదుల ఈ వంగడాన్ని అభివృద్ధి చేశారు. 2019–20 ఖరీఫ్ సీజను నుంచి రైతు క్షేత్రాల్లో మినీ కిట్ పరీక్షల నిర్వహణకు అనుమతి పొందింది.దీని పంట కాలం 130–140 రోజులు. ఈ రకం దాదాపు 110 సెం.మీ. ఎత్తు పెరుగుతుంది. పడిపోదు. దోమపోటు, అగ్గి తెగుళ్లను కొంత వరకు తట్టుకుంటుంది. మధ్యస్త సన్న రకం. వెయ్యి గింజల బరువు సుమారు 14–14.5 గ్రాములు. పైపొట్టును మాత్రమే తొలగించినప్పుడు (దంపుడు బియ్యం) 76.6% రికవరీనిస్తుంది. పాలీష్ చేస్తే 66% రికవరీనిస్తుంది. దంపుడు బియ్యం తింటే దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు, ఇతర పోషకాలన్నీ శరీరానికి అందుతాయి. పాలీష్ చేస్తే పై పొరలలోని నలుపు రంగులో ఉండే అంథోసైనిన్ తవుడులోకి వెళ్లి పోతుంది.

**ఎకరానికి 35 బస్తాల దిగుబడి** బీపీటీ 2841 రకం నారును 20“15 సె.మీ. దూరంలో నాటుకుంటే హెక్టారుకు 6 టన్నుల వరకు దిగుబడినిస్తుంది. అయితే, పిలక చేసే సామర్థ్యం తక్కువ కాబట్టి 15“15 సెం.మీ. దూరంలో నాటుకుంటే (ఎకరానికి 20–25 కిలోల విత్తనం అవసరం) మంచిదని, ఇలా చేస్తే ఎకరానికి 35 బస్తాల (హెక్టారుకు 6.5 టన్నుల) వరకు దిగుబడి సాధించవచ్చని రైతుల అనుభవాల్లో తేలిందని బాపట్ల ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త, చెప్పారు.

**రోగనిరోధక శక్తే కీలకం** బీపీటీ 2841 సన్న వరి బియ్యం రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఈ బియ్యం పైపొర నలుపు రంగులో ఉంటుంది. బియ్యానికి పై పొరలలోని నలుపు రంగు ఆంథోసైనిన్ అనే పదార్థం వల్ల వస్తుంది. మామూలుగా మనం రోజూ ఆహారంగీ తీసుకునే వరి రకాలతో పోల్చినప్పుడు నలుపు, ఊదా, ఎరుపు రంగు పై పొరగా కలిగినటువంటి వరి రకాలలో పాలీఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ పరిమాణంలో ఉంటాయి.నలుపు రంగు బియ్యం పై పొరలలో ఉండే దట్టమైన నలుపు రంగునిచ్చే ఆంథోసైనిన్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, సూపర్ ఫుడ్‌గా పిలవబడే బ్లూబెర్రీస్, బ్లాక్ బెర్రీస్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లతో సమానమైన పోషక విలువలను కలిగి ఉన్నట్లు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. బీపీటీ 5204తో పోల్చితే యాంటీ ఆక్సిడెంట్లు బీపీటీ 2841 బ్లాక్ రైస్‌లో 3–4 రెట్లు ఎక్కువగా ఉన్నాయి. పాలీష్ చేయని బీపీటీ 2841 దంపుడు బియ్యంలో వంద గ్రాములకు 90.52 మిల్లీ గ్రాముల ఫినాలిక్ పదార్థాలు, వంద గ్రాములకు 110.52 మిల్లీ గ్రాముల యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ ఉన్నట్లు కోత బాపట్లలోని అనంతర సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం ప్రయోగశాల పరీక్షల్లో వెల్లడైంది.5% పాలీష్ చేసిన బీపీటీ 2841 నల్ల బియ్యంలో కూడా వంద గ్రాములకు 90.19 మిల్లీ గ్రాముల యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ ఉన్నట్లు తేలింది. అదే విధంగా, పై పొట్టు మాత్రమే తొలగించిన ముడి బియ్యంలో 11.02%, పాలీష్ బియ్యంలో 6.3% మాంసకృత్తులున్నాయి. సూక్ష్మపోషకాలైన జింక్, ఇనుప ధాతువులు కూడా బీపీటీ 2841లో ఎక్కువ పరిమాణంలో ఉండటం విశేషం. యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను ఆహారంగా తీసుకున్నప్పుడు అవి శరీరంలో ఉత్పత్తయిన ఫ్రీరాడికల్స్‌ను సమతుల్యం చేయటం వలన పలు రకాల కేన్సర్లు, గుండె సంబంధిత సమస్య, మధుమేహం వంటి దీర్ఘకాలిక రుగ్మతలను ఎదుర్కొనే రోగనిరోధక శక్తి పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

# అన్వి... అన్నీ విశేషాలే!



ఏడాదిలోపు పిల్లలు పాకుతూ, పడుతూ లేస్తూ నడవడానికి ప్రయత్నిస్తూ పసి నవ్వులు నవ్వుతారు. వచ్చీరాని మాటలను పలుకుతూ ముద్దు లొలికిస్తుంటారు. “దాదాపు ఈ వయసువారంతా ఇలానే ఉంటారనుకుంటే మీరు పొరపడినట్లే. ప్రతిభకు వయసుతో సంబంధంలేదు. మాలాంటి చిచ్చర పిడుగులు బరిలో దిగితే అచ్చెరువు చెందాల్సిందే” అంటోంది అన్వి విశేష్ అగర్వాల్. రెండున్నరేళ్ల వయసున్న అన్వి తన పెయింటింగ్స్‌తో ఏకంగా గిన్నిస్‌బుక్ రికార్డుల్లోకి ఎక్కింది. రెండేళ్లకే ఈ రికార్డు సాధిస్తే ఇక పెద్దయ్యాక ఇంకెన్ని అద్భుతాలు చేస్తోందో అని అవాక్కయ్యేలా చేస్తోంది చిన్నారి అన్వి. భువనేశ్వర్‌కు చెందిన అన్వి విశేష్ అగర్వాల్ 72 చిత్రాలను గీసి అతి చిన్నవయసులో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించుకుంది. ఎక్కువ సంఖ్యలో పెయింటింగ్స్ వేసిన అతిపిన్న వయస్కురాలుగా నిలిచి లండన్, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకుంది. రెండున్నరేళ్ల పాప ఇన్ని రికార్డులు సాధించిందంటే చాలా విచిత్రంగా ఉన్నప్పటికీ ఇది అక్షరాలా నిజం. అన్వి పెయింటింగ్ జర్నీ కేవలం తొమ్మిది నెలల వయసులోనే జరగడం విశేషం. అప్పటినుంచి పెయింటింగ్స్ వేస్తూనే ఉంది.“మ్యాగ్నెంట్, పెండులమ్, కలర్స్ ఆన్ వీల్స్, రిఫ్లెక్షన్ ఆర్ట్, హెయిర్ కాంబ్ టెక్చర్, రీ సైక్లింగ్ ఓల్డ్ టాయిస్, హ్యూమన్ స్పైరోగ్రఫీ, దియా స్ప్రే పెయింటింగ్, బబుల్ పెయింటింగ్” వంటి 37 రకాల పెయింటింగ్ టెక్నిక్స్‌ను ఆపోశన పట్టింది. పెయింటింగేగాక పంతొమ్మిది నెలల వయసు నుంచే స్పానిష్ భాషలో మాట్లాడడం ప్రారంభించింది. 42 అక్షర మాల శబ్దాలను స్పష్టంగా పలుకుతూ 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకుంది. అత్యంత అరుదైన చిన్నారులు మాత్రమే ఇవన్నీ చేయగలుగుతారు.అన్నట్లు అన్వి అందర్నీ అబ్బురపరుస్తోంది.

# సులువులైన చిట్కాలతో
# చాక్లెట్ సమోసా-అంజీర్ హల్వా



కావలసినవి: మైదా పిండి – 1 కప్పు, పంచదార పొడి 5 టేబుల్ స్పూన్లు, నెయ్యి 2 టేబుల్ స్పూన్లు, డార్క్ చాక్లెట్ పౌడర్ 1 కప్పు, పిస్తా ముక్కలు 1 టేబుల్ స్పూన్‌పంచదార పాకం అభిరుచిని బట్టి (అప్పటికప్పుడు కావాల్సినంత పంచదార, నీళ్లు పోసుకుని స్టవ్ మీద పెట్టుకోవాలి), నీళ్లు సరిపడాతయారీ: ముందుగా ఒక బౌల్‌లో మైదాపిండి, నెయ్యి, 4 టేబుల్ స్పూన్ల పంచదార పొడి, నీళ్లు పోసుకుని బాగా కలిపి.. కొద్దికొద్దిగా నీళ్లు కలుపుకుంటూ చపాతీ ముద్దలా చేసుకుని ఓ పావు గంట పాటు ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి.ఈ సమయంలో ఒక బౌల్ తీసుకుని అందులో చాక్లెట్ పౌడర్, పంచదార పౌడర్, పిస్తా ముక్కలు వేసుకుని అటు ఇటుగా కలిపి.. పక్కన పెట్టుకోవాలి. పావు గంట తర్వాత ఫ్రిజ్‌లోంచి మైదా ముద్దను తీసి.. చిన్న చిన్న పూరీల్లా చేసుకుని.. ప్రతి పూరీలో కొంత చాక్లెట్ మిశ్రమం పెట్టుకుని సమోసాలా చుట్టుకోవాలి. అనంతరం రెండు స్టవ్‌లు ఆన్ చేసుకుని.. ఒకవైపు నూనె కళాయి, మరోవైపు పంచదార పాకం ఉన్న కళాయి పెట్టుకుని సమోసాలను నూనెలో దోరగా వేయించి.. వెంటనే పాకంలో వేసి తీసుకోవాలి. ఒకవేళ పాకంలో వేసుకోవడం ఇష్టం లేకుంటే చాక్లెట్ సాస్‌ని పైన గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకోవచ్చు.

**అంజీర్ హల్వా** కావలసినవి: డ్రై అంజీర్ 400 గ్రా.(నానబెట్టి, ముక్కలు చేసుకోవాలి) బియ్యప్పిండి/మొక్కజొన్న పిండి 5 టేబుల్ స్పూన్లు(5 టేబుల్ స్పూన్ల నీళ్లనూ జతచేసి బాగా కలుపుకోవాలి), నెయ్యి 9 టేబుల్ స్పూన్లు లేదా అంతకు మించి, పచ్చిపాలు అర కప్పు, పంచదార అభిరుచిని బట్టి, ఫుడ్ కలర్ కొద్దిగా (గ్రీన్ కలర్), యాలకుల పొడి కొద్దిగా, డ్రై ఫ్రూట్స్ ముక్కలు కొద్దిగా



తయారీ: ముందుగా పాన్ లో 2 టేబుల్ స్పూన్ల నెయ్యి వేసుకుని, వేడి కాగానే.. అందులో బియ్యప్పిండి /మొక్కజొన్నపిండి మిశ్రమం వేసుకుని గరిటెతో తిప్పుతూ ఉండాలి. పాలు పోసుకుని చిన్న మంటపైన గరిటెతో తిప్పుతూ మరిగించుకోవాలి. తర్వాత ఒక కప్పు పంచదార వేసుకుని కరిగే వరకూ గరిటెతో తిప్పుతూ ఉండాలి. అందులో అంజీర్ ముక్కలు, ఫుడ్ కలర్ వేసుకుని మధ్య మధ్యలో కొద్దికొద్దిగా నెయ్యి వేసుకుంటూ తిప్పుతూ ఉండాలి. దగ్గర పడిన తర్వాత ఒకసారి తీపి సరిపోయిందో లేదో చూసుకుని అవసరమైతే మరికొద్దిగా పంచదార వేసుకుని, మిగిలిన నెయ్యి కూడా వేసుకుని గరిటెతో కలుపుతూ దగ్గర పడే సమయంలో యాలకుల పొడి వేసుకుని స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. అభిరుచిని బట్టి నచ్చిన డ్రై ఫ్రూట్స్ ముక్కలతో గార్నిష్ చేసుకోవచ్చు లేదా.. నచ్చిన ఫ్లేవర్ ఐస్ క్రీమ్‌తో కలిసి తింటే భలే రుచిగా ఉంటుంది ఈ హల్వా.

# పీయూష్, ఆమ్‌కా పన్నా, జల్‌జీరాతో కడుపు చల్లగా..



మహారాష్ట్ర, గుజరాత్ ప్రాంతాల్లో వేసవిలో 'పీయూష్' అనే పానీయాన్ని విరివిగా తాగుతారు. దాదాపు దీని తయారీ లస్సీ మాదిరిగానే ఉంటుంది. బాగా చిలికిన పెరుగులో పంచదారతో పాటు శ్రీఖండ్ అనే సంప్రదాయ మిఠాయిని, జాజికాయ పొడి, ఏలకుల పొడి వంటివి చేర్చడం వల్ల దీనికొక విలక్షణమైన రుచి ఏర్పడుతుంది. 'పీయూషం' అంటే అమృతం అనే అర్థం ఉంది. 'పీయూష్' పానీయం అమృతసమానంగా ఉంటుందని మరాఠీ, గుజరాతీ ప్రజలు చెబుతారు.ఉత్తరాది రాష్ట్రాల్లో జల్‌జీరా, ఆమ్ కా పన్నా, ఖస్‌ఖస్, రూహ్ అఫ్జా వంటి సంప్రదాయ పానీయాలను వేసవిలో విరివిగా వినియోగిస్తారు. జీలకర్ర, మిరియాలు వంటివి కలిపి తయారుచేసే జల్‌జీరాను సాధారణంగా భోజనానికి ముందు సేవిస్తారు. దీనివల్ల అలసట తీరి, ఆకలి పుడుతుందని, జీర్ణశక్తి మెరుగుపడుతుందని చెబుతారు. పచ్చి మామిడికాయలతో తయారుచేసే ఆమ్ కా పన్నా, వట్టివేళ్లు, గసగసాలు కలిపి తయారుచేసే ఖస్‌ఖస్ పానీయాలను కొన్ని ప్రాంతాల్లో ఇష్టంగా సేవిస్తారు. గులాబీరేకుల కషాయానికి చక్కెర పాకాన్ని జోడించి తయారు చేసే 'రూహ్ అఫ్జా'తో నేరుగా షర్బత్ తయారు చేసుకోవడమే కాకుండా, దీనిని లస్సీ, మిల్క్‌షేక్, ఐస్‌క్రీమ్‌ల వంటి వాటిలోనూ అదనపు రుచికోసం ఉపయోగిస్తారు. ఘజియాబాద్‌కు చెందిన హాఫీజ్ అబ్దుల్ మజీద్ అనే యునాని వైద్యుడు శతాబ్ది కిందట రూపొందించిన 'రూఫ్ అఫ్జా' భారత ఉపఖండమంతటా విరివిగా వినియోగంలో ఉంది. కొన్ని ప్రాంతాల్లో చందనం పొడి, కుంకుమపువ్వు, పంచదార, నిమ్మరసం కలిపి తయారు చేసే చందన షర్బత్‌ను కూడా వేసవి పానీయంగా సేవిస్తారు. ఇవన్నీ ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా, వేసవితాపాన్ని తీర్చడంలో బాగా దోహదపడతాయి. ఈ వేసవిలో మీరూ వీటి రుచులను ఆస్వాదించండి.

## తల తిరగడం కూడా గుండె వైఫల్యానికి సంకేతమే!



మారుతున్న జీవనశైలి కారణంగా ప్రస్తుతం చాలామంది అధిక బీపీతో బాధపడుతున్నారు. దీనిని ఆహారంతోనే అదుపు చేయవచ్చు. గుమ్మడి గింజల్లో ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని తినడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. పొటాషియం, మెగ్నీషియం ఇందులో ఎక్కువగా ఉంటాయి. ఇవి రక్తపోటును అదుపులో ఉంచుతాయి. చేపలలో ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి మన హృదయాన్ని ఫిట్‌గా ఉంచుతాయి. రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి.

### మీకు తెలుసా?

తల తిరగడం కూడా గుండె వైఫల్యానికి సంకేతం. డీహైడ్రేషన్ వల్ల మైకం వచ్చి గుండె పనిచేయదు. గొంతు లేదా దవడలో నొప్పి కూడా గుండెపోటుకు సంకేతం. అయితే అన్ని నొప్పులు గుండెనొప్పులకి కారణమని చెప్పలేం. కొన్నిసార్లు ఇది జలుబు లేదా సైనస్ కారణంగా వస్తుంది.కానీ కొన్నిసార్లు ఛాతీ నొప్పి గొంతు నుంచి దవడకు వ్యాపిస్తుంది. ఇది చాలా ప్రమాదం. మీరు చాలా త్వరగా అలసిపోయినట్లనిపిస్తే బలహీనతగా భావించకండి. ఎందుకంటే ఇది కూడా గుండెపోటుకు కారణమయ్యే లక్షణాలలో ఒకటని గుర్తుంచుకోండి.

# చెమట కాయలా?

## చందనం పొడి, వట్టివేళ్ల పొడిని రోజ్‌వాటర్‌లో కలిపి..



ఎండలు మండుతున్నాయి. దీంతో విపరీతమైన చెమట, దురదలతో చాలా ఇబ్బంది పడిపోతుంటారు. చర్మం తన మృదుత్వాన్ని కూడా కోల్పోతుంది. చెమటకాయలు దురదకు కారణమై, చికాకు, ఆయా భాగాలలో మంట, నొప్పికి దారితీస్తాయి. అతిగా చెమట పట్టే వారిలో వీటి సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది.సాధారణంగా నుదుటిపై, ముఖం, మెడ, వీపు, ఛాతీ, తొడల మీద చెమట కాయలు వస్తుంటాయి. వీటి తీవ్రత ఎక్కువైతే చర్మం ఎర్రపొక్కులుగా మారటం, గోకటం వల్ల చర్మం చిట్లి రక్తం కారడం జరుగుతుంది. కొన్ని చిట్కాలతో కొంత ఉపశమనం పొందవచ్చు. అవేంటో చూద్దాం. ?రెండు పూటలా స్నానం చేస్తూ శరీరాన్ని శుభ్రంగా వుంచుకోవాలి. చెమట ఎక్కువగా పట్టినప్పుడు స్నానం చేయడం, లేదా తడి వస్త్రంతో శరీరాన్ని తుడవడం తప్పనిసరి. వదులుగా ఉండే పల్చని కాటన్ వస్త్రాలు వేసుకోవాలి. నీళ్లు బాగా తాగాలి. దాంతో శరీరం చల్లగా ఉంటుంది. వీలైనంత వరకు ఎండలోకి వెళ్లకుండా చూసుకోవాలి.స్నానం చేసే నీటిలో గుప్పెడు మల్లెపూలు, జాజిపూలు లేదా వట్టివేళ్ల చూర్ణం వేసి గంటసేపు నాననిచ్చి, ఆ నీటితో స్నానం చేయడం మంచిది. ఇటువంటి స్నానం శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.వంటినిండా చెమటకాయలు వచ్చినప్పుడు గంధం ముద్దని పేలిన చోట పల్చని పూతలా వేసుకుంటే, మంట, దురద తగ్గుతాయి. ఇందులో కర్పూరాన్ని కలిపి పేలిన చోట లేపనంలా రాసినా కూడా సమస్య అదుపులోకి వస్తుంది. మార్కెట్లో లభ్యమయ్యే గంధం పొడిలో సహజత్వం ఉండదు. అందుకే గంధపు చెక్కని సానపై అరగదీసి, దాన్ని వాడటం శ్రేయస్కరం.చందనం పొడి, వట్టివేళ్ల పొడిని రోజ్‌వాటర్‌లో కలిపి పల్చని లేపనంలా చెమట కాయలపై రాసినా మంచిదే. కలబంద గుజ్జుని రాసుకున్నా కూడా చెమటకాయల నుంచి ఉపశమనం కలుగుతుంది. తాటి ముంజెలలోని నీటిని చెమట కాయలపై రాసి, ఆరిన తర్వాత శుభ్రమైన వస్త్రంతో మృదువుగా తుడిచేయాలి. పుచ్చకాయ, కర్బూజా, కీరదోస, ముంజెలు, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, పల్చని మజ్జిగ... వంటి చలువచేసే పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి. కారం, గరం మసాలా, నూనెలో వేయించిన పదార్థాలకు దూరంగా ఉండాలి.

# పాకిస్థాన్‌లోని శక్తిపీఠం

# హింగ్లాజ్ దేవీ ఆలయం

పురాణ గాథలు, ఆచారాల పరంగా లయకారకుడైన పరమ శివుడి అర్ధాంగి పార్వతిదేవిని ఆరాధించే ఆలయాలు ఉన్న మహిమాన్విత ప్రదేశాలను శక్తి పీఠాలుగా పేర్కొంటారు. అసలు శక్తి పీఠాలు ఎన్ని? మనదేశంలో చాలామందికి తెలిసిన శక్తి పీఠాలు 18. అయితే, 'ప్రాణేశ్వరీ ప్రాణధాత్రీ పంచాశత్పీఠరూపిణీ' అని లలితా సహస్రనామావళి 51శక్తి పీఠాలు ఉన్నట్లు చెబుతోంది. పురాణ గ్రంథాలను పరిశీలిస్తే, 108 శక్తి పీఠాలు ఉన్నట్లు తెలియజేస్తున్నాయి. కాళీ పురాణంలో 18 శక్తి పీఠాల గురించి చెబితే, దేవీ భాగవతంలో 66 శక్తి పీఠాలు ఉన్నట్లు చెప్పారు. శక్తి పీఠాలను అర్థం చేసుకోవడానికి పురాణ



ప్రాతిపదిక కొంత మేరకు ఉపయోగపడితే, ఉపాసన పరమైన శాస్త్రం మరికొంత ఉంటుంది. యోగశాస్త్రంలోనూ, మంత్రశాస్త్రంలోనూ ఈ శక్తి పీఠాల ప్రస్తావనం ఉంది. చైతన్యానికి ఆవాసం మానవ దేహం. 51 శక్తులు మన శరీరంలో అంతర్లీనమై ఈ దేహాన్ని నడిపిస్తున్నాయని చెబుతారు. కళ్లు, చెవులు, పాదాలు, చేతులు ఇలా ప్రతిది ఒక శక్తికి ప్రతీక. అవన్నీ కలిసిన దేహమే శక్తి రూపం.

లంకాయాం శంకరీదేవీ, కామాక్షీ కాంచికాపురే
ప్రద్యుమ్నే శృంగళాదేవీ, చాముండీ క్రౌంచపట్టణే
అలంపురే జోగులాంబా, శ్రీశైలే భ్రమరాంబికా
కొల్హాపురే మహాలక్ష్మీ, మాహుర్యే ఏకవీరికా
ఉజ్జయిన్యాం మహాకాళీ, పీఠిక్యాం పురుహూతికా
ఓఢ్యాయాం గిరిజాదేవి, మాణిక్యా దక్షవాటికే
హరిక్షేత్రే కామరూపా, ప్రయాగే మాధవేశ్వరీ
జ్వాలాయాం వైష్ణవీదేవీ, గయా మాంగళ్యగౌరికా
వారాణస్యాం విశాలాక్షీ, కాష్మీరేషు సరస్వతీ
అష్టాదశ సుపీఠాని యోగినామపి దుర్లభమ్
సాయంకాలే పఠేన్నిత్యం, సర్వశత్రువినాశనమ్
సర్వరోగహరం దివ్యం సర్వ సంపత్కరం శుభమ్



ఇలా దేశంలోని అష్టాదశ శక్తి పీఠాల గురించి మనకు ఈ శ్లోకం తెలియజేస్తుంది. అయితే, 51 శక్తి పీఠాల గురించి ప్రస్తావన వచ్చినప్పుడు అందులో తప్పకుండా ఉండే శక్తి పీఠం హింగ్లాజ్ దేవి. ప్రస్తుత పాకిస్థాన్‌లోని బలూచిస్తాన్ రాష్ట్రంలో ఉందీ శక్తి పీఠం. పాకిస్థానీయులు ఈ ఆలయాన్ని నానీ మందిరంగా పిలుస్తారు.

**ఇది పురాణగాథ :** దక్ష ప్రజాపతి కుమార్తె సతీదేవి (దాక్షాయణి). కైలాస పర్వతంపై నిత్యం ధ్యానంలో ఉండే పరమశివుడిని చూసి మోహిస్తుంది. ఆ లయకారుడినే తన ప్రాణనాథుడిగా భావిస్తుంది. తండ్రి మాటను కాదని, దేవదేవుడిని వివాహమాడుతుంది. తన నిర్ణయానికి విరుద్ధంగా శివుడిని పరిణయమాడటం ఇష్టం లేని దక్షుడు కోపంతో బృహస్పతియాగాన్ని తలపెడతాడు. దేవతలందరినీ ఆహ్వానిస్తాడు కానీ, తన కుమార్తె సతీదేవి, అల్లుడు పరమేశ్వరుడిని మాత్రం పిలవడు. తండ్రి యాగానికి వెళ్తానని సతీదేవి బయలుదేరుతుంది. పిలుపు రాకుండా వెళ్లడం శ్రేయస్కరం కాదని, శివుడు వారించినా, 'పుట్టింటి వారు ప్రత్యేకంగా పిలవాలా ఏంటీ' అని ప్రమథగణాలను వెంటబెట్టుకుని యాగానికి వెళ్తుంది. అక్కడ అందరి ముందు శివుడిని దక్షుడు అవమానిస్తాడు. శివనింద సహించలేక సతీదేవి యోగాగ్నిలో భస్మమైపోతుంది. సతీదేవి మరణ వార్త విన్న శివుడు ఆగ్రహంతో ఊగిపోతాడు. ప్రమథ గణాలతో కలిసి శివ తాండవం చేస్తూ దక్షయగ్నాన్ని భగ్నం చేస్తాడు. కానీ, సతీ వియోగ దుఃఖంతో ఆమె మృత శరీరాన్ని అంటిపెట్టుకుని జగద్రక్షణ కార్యాన్ని మానేస్తాడు. దీంతో దేవతలు వెళ్లి, విష్ణుమూర్తికి మొరపెట్టుకుంటారు. దేవతల ప్రార్థన మన్నించిన శ్రీమహావిష్ణువు తన సుదర్శన చక్రంతో సతీదేవి దేహాన్ని ఖండాలుగా చేసి, శివుడి కర్తవ్యాన్ని గుర్తు చేస్తాడు. సతీదేవి శరీర భాగాలు పడిన ప్రదేశాలనే శక్తి పీఠాలుగా భక్తులకు, ముఖ్యంగా తంత్ర సాధకులకు ఆరాధాన క్షేత్రాలు అయ్యాయి. వాటిలో శిరో భాగం(బ్రహ్మ రంధ్రం' హింగోళమనే ప్రదేశంలో పడింది. అదే ఇప్పుడు పాకిస్థాన్‌లో ఉన్న శక్తి పీఠం హింగ్లాజ్ దేవి ఆలయం. ప్రతి శక్తి పీఠంలోను దాక్షాయణీ మాత భైరవుని (శివుని) తోడుగా దర్శనమిస్తుంది.మరొక స్థల పురాణం ప్రకారం త్రేతాయుగంలో విచిత్రుడు అనే సూర్యవంశానికి చెందిన క్షత్రియ రాజుకు హింగోళుడు, సుందరుడు అనే కుమారులు పుడతారు. వీరు ప్రజలను, రుషులను పీడించి హింసిస్తుంటారు. ఆ రాకుమారుల బారి నుంచి తమను రక్షించవలసిందిగా ప్రజలు శివుడిని ప్రార్థిస్తారు. శివుని ఆజ్ఞానుసారం గణపతి సుందరుడిని సంహరిస్తాడు. దాంతో రెచ్చిపోయిన హింగోళుడు మరింత విజృంభించి ప్రజలను కష్టాలకు గురిచేస్తాడు. బెంబేలెత్తిన ప్రజలు పరాశక్తిని ఆశ్రయిస్తారు. శక్తి అతడిని వెంటాడుతూ ఈ గుహలలో తన త్రిశూలంతో సంహరిస్తుంది. చనిపోయే ముందు హింగోళునికి ఇచ్చిన వరం ప్రకారం ఆ ప్రాంతంలో కొలువై అతడి పేరుతో హింగుళాదేవిగా ప్రసిద్ధి చెందింది.

మరో ఇతిహాసం ప్రకారం పరశురాముడు క్షత్రియ సంహారం చేస్తున్నప్పుడు 12 మంది క్షత్రియులకు బ్రాహ్మణ వేషం వేసి పరశు రాముడి బారి నుంచి కాపాడతారు. ఆ క్షత్రియుల సంతతి తరువాతి కాలంలో బ్రహ్మ క్షత్రియులుగా పిలువబడుతున్నారు. ఈ బ్రహ్మక్షత్రియుల కులదేవత హింగుళాదేవి.మరో కథనం ప్రకారం దధీచి మహర్షి రత్నసేనుడు అనే సింధుదేశ రాజును పరశురాముడి బారి నుంచి రక్షించడానికి ఆశ్రయమిస్తాడు. దధీచి ఆశ్రమంలో లేని సమయం చూసి పరశురాముడు రత్నసేనుడిని సంహరిస్తాడు. రత్నసేనుడి కుమారులను



బ్రాహ్మణ వటువులుగా భావించి వదిలివేస్తాడు. వారిలో జయసేనుడు సింధు రాజ్యానికి వెళ్లి పరిపాలన కొనసాగించాడు. పరశురాముడు అతడిని మట్టుపెట్టడానికి వచ్చినప్పుడు దధీచి మహర్షి ప్రసాదించిన హింగుళా దేవీ మంత్ర ప్రభావంతో కాపాడబడతాడు. ఈ దేవి జయసేనుడిని కాపాడటమే కాక పరశురాముని క్షత్రియవధను నిలిపివేయమని ఆజ్ఞాపిస్తుంది.



ఇక రామాయణం ప్రకారం, రావణ వధ తర్వాత రాముడు బ్రహ్మ హత్యదోష నివారణ కోసం హింగ్లాజ్ దేవిని సందర్శించాడని చెబుతారు.

**ఎక్కడ ఉంది :** భారత స్వాతంత్ర్యానంతరం ముస్లిం మెజార్టీ ఉన్న ప్రాంతంగా పాకిస్థాన్ ప్రత్యేక దేశంగా ఆవిర్భవించింది. అయితే, వేదకాలం నుంచి ఆ ప్రాంతమంతా భారత దేశంలో అంతర్భాగం. అక్కడ కూడా విరాందరావంతం దేదీవ్యమానంగా వెలిగింది. ఎన్నో హిందూ ఆలయాలు అక్కడ ఉన్నాయి. అయితే, ఇప్పుడు ఆ దేశం మొత్తం జనాభాలో హిందూ జనాభా 1.5శాతం మాత్రమే. దేశ విభజన తర్వాత చాలా తక్కువ మంది మాత్రమే అక్కడ ఉండిపోయారు. అయినా, ఇప్పటికీ పలు హిందూ ఆలయాలు పాకిస్థాన్‌లో ఉన్నాయి. వాటిలో హింగ్లాజ్ దేవి ఆలయం ఒకటి. హింగ్లాజ్ దేవిని ముస్లింలు బీబీ నానీగా పిలుస్తారు. పలువురు ముస్లింలు హింగ్లాజ్ దేవిని పూజిస్తారు కూడా. పాకిస్థాన్‌లోని బలూచిస్తాన్ తూర్పు ప్రాంతానికి పశ్చిమ ప్రాంతానికి మధ్యలో హింగ్లాజ్ దేవి ఆలయం ఉంది. కరాచీ నుంచి 250కి.మీ. ప్రయాణించాల్సి ఉంటుంది. రోడ్డు మార్గం ద్వారానే ఆలయానికి చేరుకోవాలి.

**వసంత కాలంలో జాతర :** ఏటా ఏప్రిల్ మాసంలో నాలుగు రోజులపాటు ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆ సమయంలో సాధువులు, హఠయోగులు హింగ్లాజ్ దేవిని కొలుస్తారు. అనేక మంది భక్తులు ఉత్సవాల సందర్భంగా ఈ దేవతను కొలిచి మొక్కు బడులు చెల్లించుకుంటారు. స్థానిక ముస్లింలు ఈ ఉత్సవాలను నానీకీ హజ్ అని పిలుస్తారు. హింగ్లాజ్ దేవి ఉత్సవాలు జరిగే సమయంలో భక్తులు పాదయాత్రగా వెళతారు. ఎందుకంటే ఎడారి ప్రాంతాన్ని తలపించే ఆ రహదారి గుండా వెళ్తే అక్కడ వీచే వేడి గాలులు శరీరాన్ని తాకి చేసిన పాపాలను పోగొడతాయని వారి నమ్మకం. అలా పవిత్రమైన దేహంతో అమ్మవారిని దర్శించుకుంటే మంచి జరుగుతుందని భావిస్తారు. ఒకప్పుడు కేవలం కాలినడకన మాత్రమే అక్కడకు వెళ్లాల్సి వచ్చేది. ఆ తర్వాత ఒంటెలు, గాడిదలపై ప్రయాణించి ఆలయానికి చేరుకునేవారు. 2004 తర్వాత ప్రభుత్వం ఆ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో వాహనాల్లో నేరుగా దేవి ఆలయానికి చేరుకోవచ్చు. అయితే, సంప్రదాయం పాటించే వారు ఇప్పటికీ హింగ్లాజ్ దేవి ఆలయానికి నడిచి వెళ్తారు. అలా ఆలయ సమీపానికి చేరుకున్న భక్తులు అక్కడ ప్రవహించే హింగ్లోజ్ నదిలో స్నానమాచరించి దేవిని దర్శించుకుంటారు. హింగ్లాజ్ దేవిని దర్శించుకున్న తర్వాత భక్తులు అక్కడి సమీపంలో ఉన్న చంద్రగప్, కందేవారీ అనే బురదతో కూడిన అగ్నిపర్వతంపైకి వెళ్తారు. ఆ బురదలో పూలు చల్లి, తమ వెంట తెచ్చుకున్న కొబ్బరి కాయలను అందులో ముంచుతారు. బురద అంటిన ఆ కొబ్బరి కాయలను ఇంటిలో పెట్టుకుంటే శుభాలు జరుగుతాయని మరికొందరి నమ్మకం. కొందరు ఆ బురదను శరీరానికి పూసుకుంటారు. మరి కొందరు ఆ బురదతో చిన్న ఇళ్లు కడతారు. అలా చేస్తే వారి సొంత ఇంటి కల



నిజమవుతుందని విశ్వాసం. హింగ్లాజ్ దేవి ఆలయం చుట్టూ గణేశ్‌దేవ, కాళీ మాత, గురుఘోరక్ నాథ్ ధూని, బ్రహ్మకుధ్, తిర్‌కుండ్, గురు నానక్‌రావ్, రామ్‌జరోఖా బేతక్, అనిల్‌కుద్, చౌరాసీ పర్వతం, చంద్రగూప్, అఘోరి పూజ తదితర ఆలయాలు, ప్రార్థనా ప్రదేశాలు ఉన్నాయి. **కర్తార్‌పూర్ కారిడార్‌లా..** సిక్కులకు కర్తార్‌పూర్ కారిడార్‌లా భారతదేశంలోని హిందువులు హింగ్లాజ్‌దేవిని దర్శించుకోవడానికి కారిడార్‌ను ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. భాజపా మాజీ ఎంపీ తరుణ్ విజయ్ ఇదే విషయంపై ప్రధాని నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు. హింగ్లాజ్ దేవి ఆలయానికి కారిడార్‌ను ఏర్పాటు చేస్తే, ఇరుదేశాలు పర్యాటకంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. హింగ్లాజ్ దేవిని తమ కులదైవంగా భావించే వాళ్లు భారత్‌లో అనేకమంది ఉన్నారని, అలాంటి వాళ్లు ఆ దేవిని దర్శించుకునే భాగ్యం కలుగుతుందని ఆయన విన్నవించారు.





**గోపీచంద్ 'సాహసం' :**

ఒకప్పుడు హింగ్లాజ్‌దేవి ఆలయం గురించి తెలుగువారికి పెద్దగా తెలియదు. గోపీచంద్ కథానాయకుడిగా చంద్రశేఖర్ యేలేటి దర్శకత్వంలో వచ్చిన 'సాహసం' చిత్రం ఈ ఆలయ ఇతివృత్తంగా సాగుతుంది

. ఓం హింగుళే పరమ హింగుళే అమృతరూపిణీ తనుశక్తి
మనః శివే శ్రీ హింగుళాయ నమః స్వాహా

# ఘనంగా గడ్డం వెంకటస్వామి (కాక) వర్ధంతి వేడుకలు

మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండల పరిధిలోని ఐటీ, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మంథని మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాధుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో మంథని లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గడ్డం వెంకటస్వామి (కాక) వర్ధంతి వేడుకలు నిర్వహించారు. కాక చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికర్ కిషన్ జీ, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి మంథని సురేష్ మాట్లాడుతూ స్వర్గీయ శ్రీపాద రావు, వెంకటస్వామిల అనుబంధం ఎనలేనిదని, వీరు ఎన్నో పోరాటాలు చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యున్నత స్థానంలో సేవలను అందించారనీ అన్నారు. ఆ కాలంలో ఎఫ్సిఐ, సింగరేణి కంపెనీలు నష్టాల్లో కూరుకుపోతున్న సమయంలో కేంద్రంతో మాట్లాడి సంస్థలను కాపాడింది కాక వెంకట స్వామి అని కొనియాడారు. 20 ఏండ్లు నిండకుండానే ఉద్యమం సాగించారనీ, నిజాం వ్యతిరేక పోరాటంలో కాకా వెంకటస్వామి జైలుకెళ్ళారని, ఇలాంటి పట్టుదలే తెలంగాణ ఉద్యమం ఆయన్ని తిరుగులేని నేతగా మార్చిందని అన్నారు. భవన నిర్మాణ కూలీగా, ఉద్యమకారుడిగా మొదలైన కాకా వెంకటస్వామి ప్రస్థానం... పేదలు, కార్మికుల నాయకుడిగా, ఆ తరువాత ఎంపీగా, కేంద్ర మంత్రిగా జాతీయ స్థాయికి చేరిందని అన్నారు. మెట్రిక్ మాత్రమే చదివిన ఆయనకు జీవితం నేర్పిన అనుభవమే అంతర్జాతీయ స్థాయిలో కార్మికుల తరపున ప్రసంగించే స్థాయికి తీసుకెళ్లిందన్నారు, స్వాతంత్ర్యోద్యమం నుంచి తెలంగాణ సాధన ఉద్యమం దాకా అన్నింటిలోనూ పాల్గొన్న కాకా దేశంలోనే సీనియర్ రాజకీయ నేతల్లో ఒకరిగా నిలిచారని అన్నారు. అప్పట్లో హైదరాబాద్ లో బతకడానికి వచ్చిన పేదలు ఖాళీ జాగాల్లో గుడిసెలు వేసుకునేవారని, భూముల విలువ పెరగడంతో భూస్వాములు పేదలను వెళ్లగొట్టడం మొదలుపెట్టారని, గూండాలతో దౌర్జన్యంగా వెళ్లగొడుతున్న తీరును చూసి వెంకటస్వామి చాలిచిపోయారని, 1949లో దేశంలోనే మొదటిసారిగా జాతీయ గుడిసెల సంఘం పెట్టారని, కాకా పోరాటంతో హైదరాబాద్ నగరంలోనే దాదాపు 80 వేల మందికి సొంత గూడు దక్కిందన్నారు. భవన నిర్మాణ కూలీలు, రిక్షా కార్మికుల సమస్యలపైనా కాకా పోరాటం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ పట్టణ అధ్యక్షులు నరేడ్ల ఓదెలు, ఎన్ఎస్ యుఐ మండల అధ్యక్షులు జంజర్ల శైలేందర్, లైసెట్టి రాజు, జనగామ సదవలి, గొల్లపల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఎరుకల మధు, పొనగంటి రమేష్, అక్కపాక సది, తల్లపల్లి సత్యం, యూత్ కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ ఫహీం, చంద్రు విజయ్, నితీష్, ఎరుకల రమేష్ బాబు, రంజిత్, జ్ఞాని, నగేష్, కార్తీక్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.



# మిగిలిన మూడు కిలోల బంగారం 9 లక్షలకే

## - చూసిందంతా బంగారమే



**సిరికొండ (ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం పోతునూరు గ్రామానికి చెందిన పొందెల మహేష్ కు గుర్తు తెలియని రమేష్ అనే వ్యక్తి ఫోన్ చేసి కేరళలోని మైసూర్ లో (జెసిబి డ్రైవర్) గా పనిచేస్తున్నానని నమ్మించి జెసిబి తవ్వకాలలో తనకి ఒక కుండ దొరికిందని దానిలో బంగారం ఉందని దాని బరువు మూడు కిలోలు ఉంటుందని, నమ్మించి అట్టి బంగారాన్ని తక్కువ ధరకే ఇస్తానని నమ్మ పలికి, కావాలంటే పరీక్షించుకోవచ్చని చెప్పి, ఆంధ్రప్రదేశ్ లోని చిత్తూరు జిల్లా మదనపల్లికి రమ్మనడంతో అది నమ్మిన మహేష్ అక్కడికి వెళ్లి ఆ బంగారం లోని ఒక గ్రామ్ బంగారం తీసుకుని షాప్ కు వెళ్లి టెస్ట్ చేయించగా ఇది నిజమైన బంగారంగా తేలింది. మిగిలిన మూడు కిలోల బంగారం 9 లక్షలకు ధర చేయగా మహేష్ తన దగ్గర ఏడు లక్షలు మాత్రమే ఉన్నా యని చెప్పడంతో, దీనిని అదును చేసుకొని సరేనని ఏడు లక్షల రూపాయలను బెంగళూరు దగ్గర సిద్ధలాపూర్ జిల్లా పూమా మార్కెట్ దగ్గరకు తీసుకురావాలని మహేష్ తో తెలపగా. మహేష్ అతని మేనల్లుడు రంజిత్ తో కలిసి బెంగళూరు వెళ్లి ఏడు లక్షల రూపాయలు రమేష్ కు అతనితోపాటు ఉన్న ఇద్దరు వ్యక్తులకు ఇచ్చి అట్టి బంగారమును తీసుకొని ఇంటికి వచ్చి టెస్ట్ చేసి చూడగా బంగారం నకిలీ అని తేలింది. ఇట్టి విషయమై మహేష్ సిరికొండ పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు ఇవ్వగా సిరికొండ ఎస్సై ఎల్ రామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# బాలికలకు రెసిడెన్షియల్ స్కూల్స్ బంగారు భవిష్యత్ ను ఇవ్వాలని మనసారా కోరుతున్నా.

**- మంచి సంస్కృతి సాంప్రదాయాలతో సమాజంలో పౌరుడిగా ఎదగాలని కోరుతున్నా**

**- కన్న కలలు సాకరమయ్యేందుకు విద్యార్థిని లు నిరంతరం శ్రమించాలి. - తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**

**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మెదక్ జిల్లాలో ఆదివారం పర్యటించి కుల్చారం మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర బాలికల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థినిలతో ఏర్పాటు చేసిన ముఖాముఖి చర్చా కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ను కళాశాల విద్యార్థినులు గౌరవ వందనం తో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని జ్యోతిప్రజ్వలన గావించించి సభా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు విభిన్న సంస్కృతి సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ప్రదర్శించారు. తదనంతరం విద్యార్థినులు వేసిన పలు ప్రశ్నలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సమాధానాలు ఇచ్చారు. క్రీడలలో బ్యాడ్మింటన్ క్రీడ అంటే ఇష్టమని, భారత మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తనకు ఆదర్శమని, నిరంతరం చదవడం, రాయడం పైనే ఆసక్తి చూపుతానని, పుస్తకాలే తన నేస్తమన్నారు. అంతకంటే ఎక్కువగా పిల్లలతో గడపడం మరింత ఇస్తామన్నారు. చిన్నారులు చక్కని ప్రశ్నలు వేశారని, అవి తనను ఎంతో ఆనందింప జేశాయన్నారు. దేశ భవిష్యత్తు కు పునాదిలాంటి వారని, సమస్యలను అధిగమిస్తూ లక్ష్యాలను సాధించాలన్నారు. విద్యాలయాలు దేవాలయాలతో సమానమని, చిన్నతనం నుండే క్రమశిక్షణ తో మెసలుతూమంచి నాగరికత పుణికి పుచ్చుకొని భవిష్యత్ కు మార్గ నిర్దేశనం చేసుకోవాలన్నారు. మెదక్ పార్లమెంటు సభ్యుడు రఘునందన్ రావు మాట్లాడుతూ. దేశప్రగతి విద్యార్థుల తరగతి గదులలోనే అని స్వామి వివేకానంద అన్నట్లు చెబుతూ విద్యను ఇష్టత తోఅభ్యసించాలన్నారు. విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్న రెసిడెన్షియల్ పాఠశాలల లక్ష్యాలను ప్రశంసించారు. నరసాపురం శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ. విద్యార్థినులు భిన్న సంస్కృతులను మేళవిస్తూ ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయన్నారు. పట్టుదల,క్రమశిక్షణతో ఉన్నత స్థానానికి ఎదగాలని అనుకున్న విద్యార్థులకు రెసిడెన్షియల్ పాఠశాలలు పునాది లాంటివని, తప్పనిసరిగా అనుకున్న లక్ష్యాలను సాధించ గలుగుతారన్నారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను ఘనంగా సన్మానము అనంతరం రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపుల్ సెక్రటరీ దాన కిషోర్, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, రెసిడెన్షియల్ స్కూల్స్ సెక్రెటరీ అలుగు వర్షిణి అదనపు కలెక్టర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఇంటర్నేషనల్ త్రోబాల్ ఛాంపియన్ కత్తి ప్రసన్న కుమారి కి అభినందనలు



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** ఇండియా తరపున త్రోబాల్ పోటీలకు మొత్తం నలుగురు అమ్మాయిలు ఎంపిక అయ్యారు, అందులో మన మేడ్చల్ ప్రాంతానికి చెందిన కత్తి ప్రసన్న కుమారి. ఎంపిక కావడం చాలా సంతోషకరమని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ వజ్రష్ యాదవ్ అన్నారు. మేడ్చల్ ఏ బ్లాక్ ఎస్సి సెల్ అధ్యక్షులు పానుగంటి మహేష్ ఆధ్వర్యంలో మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ని కలిసిన తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ కెప్టెన్ కత్తి ప్రసన్న కుమారి,తదినంతరం ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ మన మేడ్చల్ ప్రాంతం చెందిన అమ్మాయి ఎంతో కష్టపడి చిన్న వయసులో త్రోబాల్ అంతర్జాతీయ స్థాయిలో గెలుపొంది. ఈ నెల డిసెంబర్ 24 నుండి 28 వరకు జరగబోయే ఇండియా త్రోబాల్ పోటీలో ఆడేందుకు తమిళనాడులోని ఉసురు జిల్లాకు వెళు తున్నందుకు ఆమెకు నాయొక్క శుభాకాంక్షలు తెలుపుతూన్ననని ఆయన అన్నారు. ప్రసన్న గతంలో కూడా నేషనల్, ఇంటర్నేషనల్, అంతర్జాతీయ స్థాయిలో, ఆడి ఎన్నో పథకాలు సాధించింది, తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ జట్టుకి కెప్టెన్గా కూడా వ్యవహరించిందని ఆయన తెలిపారు, భవిష్యత్తులో ఇంకా ఎన్నో పథకాలను సాధించాలని కోరుకున్నట్లు కూడా ఆయన తెలిపారు. ఇలాంటివారిని ప్రోత్సహిస్తే మరికొందరు కూడా ఇలాంటి ఆటలపై మక్కువ చూపుతారు అని కూడా ఆయన అన్నారు, అలాగే త్రో బాల్ ఛాంపియన్ అయినటువంటి కత్తి ప్రసన్న కుమారికి తన వంతు ఆర్థిక సహాయం కూడా అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు పానుగంటి మహేష్ కుమార్, గుండ్లపోచంపల్లి మున్సిపల్ 5వ వార్డు యువ నాయకులు కుండ భానుచందర్, శ్యామ్ రావు, కుండ ప్రవీణ్ కుమార్, కొమ్ము రాజు, వినయ్, స్టాలిన్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# కేరళ వామపక్ష ప్రభుత్వం దేశానికి దిక్సూచి,

# కేరళ సంఘీభావ సభలో, ప్రజాసంఘాల నాయకులు



**మంథని ( ప్రశ్న న్యూస్)** కేరళ రాష్ట్ర సంఘీభావ సభ ఈరోజు సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మంథని మున్సిపల్ ఆఫీస్ ఆవరణలో బూడిద గణేష్ అధ్యక్షతన జరిగింది. ఇందులో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిద గణేష్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి ముఖ్య వక్తలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుండి కేరళ ప్రభుత్వానికి రావలసిన వాటా 57,400 కోట్లు కేంద్రం చెల్లించడానికి కేరళ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లాల్సి వచ్చిందని అని, రాష్ట్రానికి రావలసిన జిఎస్టి పర్సంటేజీ తగ్గించిందని, కేరళ రాష్ట్రం అప్పులు తీసుకురావడానికి కూడా కేంద్ర ప్రభుత్వం అనుమతించడం లేదని, వరదల్లో 400 మందికి పైగా చనిపోయి 100 మంది కనపడకుండా వెళ్లి వేలాది కోట్లు నష్టం జరిగితే రాష్ట్ర ప్రభుత్వం 2,138 కోట్లు అడిగితే కేవలం 100 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందని, వామపక్ష ప్రభుత్వాన్ని ఇలా ఆర్థిక దిగ్బంధనానికి గురిచేస్తూ, అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా పెండింగ్లో పెడుతూ పరిపాలనకు అనేక ఆటంకాలు సృష్టిస్తుందని, మతం, కులం ఘర్షణలను సృష్టిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని, ముఖ్యమంత్రి, మంత్రుల పైన అక్రమ కేసులు బనాయించి వామపక్ష ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని కుట్రలు చేస్తుందని, కేరళ ప్రజల ప్రజాస్వామిక హక్కులను కాలరాయడానికి అనేక విధాలుగా కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని అన్నారు. ఇన్ని ఆటంకాలు ఎదుర్కొంటూ కేరళ వామపక్ష ప్రభుత్వం అనేక ప్రజా ఉపయోగ కార్యక్రమాలతో కేరళ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడుపుతుందని పేర్కొన్నారు. పారిశ్రామిక రంగంలో 12 శాతం నుండి 17% అభివృద్ధి సాధించింది, ఫ్రెండ్లీ ఇండస్ట్రియల్ లిస్టులో దేశంలో 23వ స్థానంలో ఉన్న కేరళ నేడు ప్రథమ స్థానంలో ఉంది, ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి 5000 కోట్ల రూపాయలు ఖర్చు చేసి మౌలిక వసతులు కల్పించడం మూలంగా కొత్తగా పది లక్షల మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరారు. అక్షరాస్యతలు రాష్ట్రం 100% సాధించింది, వైద్య ఆరోగ్య రంగం కోసం భారీ బడ్జెట్ పెంచింది,ప్రతి పంచాయతీలో హెల్త్ సెంటర్ పెట్టి ఫుల్ టైం డాక్టర్ని నియమించింది, ఈ రకంగా విద్యా, వైద్య రంగంలో దేశంలోనే కేరళ రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. 2016 నుండి ఆ రాష్ట్రంలోని ప్రతి కార్మికుడికి నెలకు 18 వేల కనీస వేతనం అమలు చేస్తున్నదని, అసంఘటితరంగా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసిందని, కోపరేటివ్ సొసైటీల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్నదని అన్నారు. వ్యవసాయరంగం అభివృద్ధి 2 శాతం నుండి 4.64 శాతానికి పెరిగింది, అక్కడ పండించిన పంట క్వింటాలు ధాన్యానికి 2,850 రూపాయలు ఇస్తూ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. రైతు సంక్షేమ నిధి ఏర్పాటు చేసి 5000 పెన్షన్ ఇస్తూ దేశంలో రైతు ఆత్మహత్యలు లేని రాష్ట్రం కేరళ ఒక్కటే, ప్రజా పంపిణీ వ్యవస్థకు గతంలో 5242 కోట్లు కేటాయిస్తే ప్రస్తుత ఎల్ డి ఎఫ్ ప్రభుత్వం 10,697 కోట్లు కేటాయించి పేదలకు నిత్యవసర సరుకులు తక్కువ ధరకు ఇస్తున్నది. 4 లక్షల తో పేదలకు ఈ కాలంలో 4 లక్షల 60 వేల పక్కా ఇండ్లు నిర్మించి ఇచ్చింది, 2,27,88 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసింది. ప్రైవేట్ రంగంలో 3 లక్షల ఉద్యోగాలు కల్పించింది. రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థలు గతంలో 8 మాత్రమే లాభాల్లో ఉంటే ప్రస్తుతం 41 సంస్థను లాభాల బాట పట్టించింది, గ్రామీణ ఉపాధి హామీ స్కీములో దేశంలో సగటున పని దినాలు 45 ఉంటే కేరళలో 67 రోజులుగా ఉంది, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరింప చేసి అమలు చేస్తూ పట్టణాల్లో ఉండే పేదలకు ఉపాధిని కల్పిస్తున్న ఏకైక రాష్ట్రం కేరళ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలకు ప్రత్యామ్నాయంగా కేరళ వామపక్ష ప్రభుత్వం తనకున్న పరిమితే వనరులు,అధికారాలతో ప్రజలకు మేలు చేస్తున్నది. కేంద్ర బిజెపి ప్రభుత్వం కేరళకు సహకరించకుండా వారి హక్కులను నిరాకరిస్తూ,ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పెడుతూ, రాజకీయంగా దాడి చేస్తున్నది. కేరళకు న్యాయంగా రావలసిన వాటాల ప్రకారం గా నిధులు కేటాయించకుండా ఆర్థిక ఇబ్బందులు సృష్టిస్తున్నది, ప్రకృతి విపత్తులు వరదలు వచ్చినా ఆదుకోవడం లేదు. ఈ నేపథ్యంలో కేరళ వామపక్ష ప్రభుత్వానికి దేశ ప్రజలందరూ అండగా నిలబడాలి, కేరళ ప్రజలకు సంఘీభావం తెలపాలి, అందుకే కేరళ ప్రజల హక్కులకు అండగా నిలబడదాం, వామపక్ష ప్రభుత్వ ప్రత్యామ్నాయ విధానాలను బలపరుద్దాం అని పిలుపునిచ్చారు. ఈ సభలో సిఐటియు నాయకులు మల్లేష్, సింగారపు గట్టయ్య వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రసాద్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల్లో రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారాలివే..!



హైదరాబాద్ : చిన్నారులకు సహజంగానే రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. అందుకనే వారికి త్వరగా వ్యాధులు వస్తాయి. ముఖ్యంగా ఈ సీజన్‌లో దగ్గు, జలుబు, జ్వరం వస్తుంటాయి. అయితే మన ఇంట్లో ఉండే సహజ సిద్ధమైన పదార్థాలను వారికి రోజూ తినిపిస్తే చాలు.. దాంతో వారి రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధులు రాకుండా ఉంటాయి. మరి ఆ పదార్థాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందామా..!

**1. పెరుగు :** చిన్నారులకు నిత్యం పెరుగును కచ్చితంగా తినిపించాలి. దీంతో వారి శరీరంలో ఉండే చెడు బాక్టీరియా నశిస్తుంది. జీర్ణక్రియ సాఫీగా జరుగుతుంది. పెరుగులో ఉండే కాల్షియం పిల్లల ఎముకలను దృఢంగా చేస్తుంది.

**2. నిమ్మజాతి పండ్లు :** నిమ్మజాతికి చెందిన నారింజ, బత్తాయి తదితర పండ్లను చిన్నారులకు ఇవ్వడం వల్ల వాటిలో ఉండే విటమిన్ సి పిల్లల్లో రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దగ్గు, జలుబు, జ్వరం వంటి శ్వాసకోశ వ్యాధులను రాకుండా చూస్తుంది.

**3. నట్స్ :** పిల్లలకు రోజూ జీడిపప్పు, బాదం, పిస్తాపప్పు తదితర నట్స్‌ను తినిపించడం వల్ల వాటిలో ఉండే పోషకాలు వారిలో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే పిల్లలు బలంగా తయారవుతారు. వారికి సంపూర్ణ పోషణ లభిస్తుంది. అనారోగ్యాలు రాకుండా ఉంటాయి.

**4. క్యారెట్లు :** పిల్లలకు విటమిన్ ఎ, జింక్ సమృద్ధిగా లభించాలంటే వారికి నిత్యం క్యారెట్లను తినిపించాలి. వీటితో కంటి చూపు మెరుగు పడుతుంది. శరీర రోగ నిరోధక శక్తి పెరిగి ఇన్‌ఫెక్షన్లు రాకుండా ఉంటాయి.

# 14 వ వార్డులో అంగన్ వాడీ కేంద్రం ప్రారంభం

**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 14 వ వార్డులో ఆదివారం అంగన్వాడి కేంద్రాన్ని మేడ్చల్ మున్సిపల్ చైర్పర్సన్ స్థానిక కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. దాసుగారి వేంకట నరసింహారావు (కరణం పంతులు) స్మారక చిహ్నముగా ఎడ్ల శ్రీనివాసరెడ్డి 14వ వార్డు కౌన్సిలర్ సౌజన్యంతో 14వ వార్డులోని శ్రీబాలాజినగర్ కాలని రోడ్ నెం ఒకటి నందు అంగన్వాడి కేంద్రాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నరసింహారెడ్డి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రం ద్వారా ఎంతోమంది గర్భిణులకు శిశువులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. 14వ వార్డు కౌన్సిలర్ ఎడ్లా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రమునకు స్థలాన్ని ఇచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. 14వ వార్డు అభివృద్ధికి ఎల్లవేళల కృషి చేస్తున్నానని వార్డ్ ప్రజలు ఎంతో సహకరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, అంగన్వాడి కేంద్ర స్థల దాత కుమారులు కిషన్ రావు, మోహన్ రావు, అంగన్ వాడి సూపర్ వైజర్ హేమలత, కౌన్సిలర్లు, కాలనీల కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# స్కూల్ భవనాలే అక్రమ నిర్మాణాలు

## -చక్రం తిప్పిన న్యాక్ ఇంజనీర్, చైన్ మెన్

- అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇవ్వని వైనం
- ఇచ్ఛామంటూ ఫిర్యాదుదారులకు, మీడియాకు బుకాయింపు
- నోటీసులు పూర్తిగా ఇస్తే కూల్చివేతలు ఎందుకు చేయలేదో.?
- లంచాలు తీసుకొని కూల్చివేతలు చేయలేని అధికారులు, సిబ్బంది
- కాప్రా సర్కిల్ పరిధిలో అడుగడుగునా అవినీతిదే రాజ్యం
- కొత్తగా వచ్చిన టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు స్పందించిన చర్యలు తీసుకునేనా














**నాచారం (ప్రశ్న న్యూస్)** కాప్రా సర్కిల్ పరిధిలో దాదాపు సంవత్సర కాలం నుండి నాచారం, మల్లాపూర్ డివిజన్ పరిధిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేతలు చేయకపోవడం వెనుక భారీగా అవినీతి అక్రమాలు జరగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ చైన్ మెన్ గా రాజు, న్యాక్ ఇంజనీర్ గా అశ్విని విధులు నిర్వహిస్తున్న సమయంలో అక్రమ నిర్మాణాలను భారీగా ప్రోత్సహించారని స్థానికంగా రాజకీయ నాయకులతో చేతులు కలిపి ఫిర్యాదులు వచ్చిన, పత్రికలో కథనాలు వచ్చిన లెక్కచేయకుండా అక్రమ నిర్మాణాలను చర్యలు తీసుకోకుండా మేనేజ్ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. నోటీసులు కూడా జిహెచ్ఎంసి నియమ నిబంధనల ప్రకారం అక్రమ నిర్మాణాలకు జారీ చేయలేదని అక్రమ నిర్మాణదారులతో చేతులు కలిపి సరైన సమయంలో కూల్చివేతలు చేయకుండా అంతర్గతంగా అడ్డుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దానితో జిహెచ్ఎంసి పరిధిలో ప్రభుత్వానికి రావలసిన ఆదాయం భారీగా గండి పడిందని దీనిపై ఉన్నత అధికారుల స్పందించి న్యాక్ ఇంజనీర్ అశ్విని ఉద్యోగం నుండి పూర్తిగా తొలగించాలని అదేవిధంగా చైన్ మెన్ రాజుని సస్పెండ్ చేయాలని కానీ ఉన్నత అధికారులు నిర్లక్ష్యం వల్ల చైన్ మెన్ రాజుని కేవలం ట్రాన్ఫర్ చేసి చేతులు దులుపుకోవడం విడుదూరంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాచారం, మల్లాపూర్ డివిజన్ కు న్యాక్ ఇంజనీర్ గా అశ్విని, చైన్ మెన్ గా రాజు బాధ్యతలు చేపట్టిన నాటినుండి ఎన్ని అక్రమ నిర్మాణాలు జరిగాయి.? ఎన్ని భవనాలకు నోటీసులు జారీ చేశారు.? ఏం చర్యలు తీసుకున్నారు.? సక్రమంగా సరైన సమయంలో నోటీసులు జారీ చేశారా.? నోటీసులు జారీ చేసిన రికార్డు మెంటెన్ చేశారా.? పూర్తిస్థాయిలో వివరాలు మీడియా ముందుకు తీసుకురావాలని లేని పక్షంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ హస్తం కూడా ఉంటుందన్న అనుమానం వ్యక్తం వ్యక్తమవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇందిరా స్కూల్, కస్తూర్బా స్కూల్ భవనాలకు ఎలాంటి అనుమతులు లేకుండా కమర్షియల్ గా స్కూల్ వ్యాపారం నిర్వహిస్తూ కోట్లు గడిస్తూ ప్రభుత్వాన్ని మోసం చేసి నిర్మాణాలు చేస్తుంటే అధికారులు, సిబ్బంది సహకరించరని ఎంతవరకు సమంజసం అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. జిహెచ్ఎంసి ఆదాయానికి గండికోట్టి నిర్మాణాలు చేశారని ఈ విషయం పై పత్రికలో కథనాలు వచ్చిన నోటీసులు కూడా పూర్తిస్థాయిలో జారీ చేయలేదని స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైన కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ డిసిపి స్పందించి ఈ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# బస్సులు రావు.. ప్రజలు పోరు

**- బాల్కొండ బస్టాండ్ పశువుల కొట్టమా.? - పాలకుల నిర్లక్ష్యమే ప్రయాణికులకు శాపమయిందా.?**

**- రాత్రి వేళలో విటులకు, ప్రేమికులకు మంచి అనువుగా మారిన బాల్కొండ బస్టాండ్**







**బాల్కొండ (ప్రశ్న న్యూస్)** పాలకుల నిర్లక్ష్యంతో ప్రజల కష్టాలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. ఎన్నికల ముందు అర చేతిలో వైకుంఠం చూపిస్తారు. గెలిచాక ఓటు వేసిన ప్రజలను నిలువెత్తున మోసం చేస్తారు నమ్మశక్యం లేని వాగ్దానాలతో ఇదే ఇప్పుడు నిజమైన రాజకీయంగా మారింది. నిజామాబాద్ జిల్లా బాల్కొండ పేరుకే అసెంబ్లీ నియోజక వర్గం బాల్కొండ లో బస్టాండ్ లేదని అల్ల కొండ ఖిల్లా పరిరక్షణ సమితి కార్యనిర్వహక అద్యక్షులు నర్సింగ్ రావు డిసెంబర్ 20 న ముఖ్యమంత్రి కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల బాల్కొండ ఎమ్మెల్యే మాజీ స్పీకర్ సురేష్ రెడ్డి హయంలో తేది 25-02-1991 ( 33 సంవత్సరాల క్రితం) రోడ్ల భవనాల శాఖ మాజీ మంత్రి సంతోష్ రెడ్డి బస్ స్టాండ్ ప్రారంభించిన నాటి నుండి నేటి వరకు బస్టాండ్ లోకి బస్సులు రావు ప్రజలు పోరు. దీనిపై ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం ఒకవైపు అయితే ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం మరోవైపు తోడైంది దానితో లక్షలు పెట్టి కట్టిన బస్టాండ్ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ప్రయాణికులు పోక పోవడంతో బస్టాండ్ పశువుల కొట్టంగా,రాత్రుల్లో విటులకు, ప్రేమికుల మంచి అడ్డాగా మారిందని ఇంత వరకు బస్టాండ్ లేదని ప్రజలు ప్రయాణికులు బస్సుల కోసం జాతీయ రహదారి పైనే నిల్చుండి బస్సుల కొరకు గంటల తరబడి వేచి చూడవలసిందే కానీ ఈ విషయం గురించి ఏ పార్టీ నాయకులు పట్టించు కోవడం లేదని నర్సింగ్ రావు అవేదన వ్యక్తం చేశారు. ఇది ఇలా ఉండగా ప్రస్తుతము నిజామాబాద్ ఆర్మూర్, హైదరాబాద్ నుండి వచ్చిన బస్సులు జాతీయ రహదారి పైనే ప్రయాణికులని దించేసి వెళ్తూ ఉంటారు. అలాగే ఆదిలాబాద్ నిర్మల్ ప్రాంతాల నుండి ప్రాంతాల నుండి వచ్చిన బస్సులు ప్రయాణికులను కూడా ఇదే జాతీయ రహదారిపై దించేసి వెళుతూ ఉంటాయి.కానీ లక్షలు పెట్టి కట్టిన బస్టాండును వినియోగంలోకి తీసుకురావాలన్న చిత్తశుద్ధి ఒక్క నాయకునికి లేకపోవడం విడ్డూరంగా మారింది. స్థానిక సమస్యలను తీర్చలేని నాయకులు తెల్లచొక్కా వేసుకొని మేము రాజకీయ నాయకులం ప్రజల సేవ చేస్తాం అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారు కానీ సమస్యలు మాత్రం గాలికి వదిలేశారు తెల్లచొక్కా నాయకులు అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులు కూర్చోవడానికి రోడ్డు పైన బెంచీలు, షెల్టర్ గాని లేవు, దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, చాలా ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన వివరించారు.తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని నిజామాబాద్, హైదరాబాద్ ఆర్మూర్ నుండి వచ్చే బస్సులు బాల్కొండ నెహ్రూ నగర్ బైపాస్ బ్రిడ్జి పైనుండి కాకుండా నేషనల్ హైవే అథారిటీ వారు నిర్మించిన సబ్ వే రోడ్డు ద్వారా నెహ్రూ నగర్ బ్రిడ్జి వద్ద బస్సులు ఆపి ప్రయాణికుల్ని దించి వేస్తే ఎన్టీఆర్ నగర్ నెహ్రూ నగర్ బాల్కొండ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అలాగే అదిలాబాద్, నిర్మల్ నుండి బాల్కొండ కు వచ్చే బస్సులు 1991లో (33 సంవత్సరాల క్రితం) లో నిర్మించిన బస్టాండ్ ముందు ప్రయాణికులు దించేస్తే చాలా అనుకూలంగా ఉంటుందని కావున ముఖ్య మంత్రి ఆర్.టీ.సీ ఉన్నత అధికారులకు ఆదేశాలు జారీ చెయ్యాలని బాల్కొండ ప్రజలు కోరుచున్నారని నర్సింగ్ రావు ముఖ్య మంత్రికి విజ్ఞప్తి చేసారు.

### లాలాపేటలో

# వసూల్ రాజా

## అక్రమ నిర్మాణాలకు శిస్తు కష్టాల్సిందే

- స్థానిక ఎమ్మెల్యే పేరుతో బెదిరింపులకు దిగుతున్న వైనం
- మహిళలను రంగంలోకి దించి లక్షలలో వసూళ్లకు ప్రయత్నం
- లాలాపేటలో నిర్మాణాలు అంటేనే వనికి పోతున్న బిల్డర్లు
- డబ్బు అవసరం ఉన్నప్పుడల్ల ఇవ్వాలని బిల్డర్లకు బెదిరింపులంట
- లాలాపేటలో బిల్డర్ల వద్ద వసూళ్లకు "చంద్ర"ంతో "కళ" వస్తుందా.?



**తార్నాక (ప్రశ్న న్యూస్)** తార్నాక డివిజన్ పరిధిలోని రాజకీయం ముసుగులో వసూలుదంగా జోరుగా సాగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. లాలాపేటలో ఒక నిర్మాణం చేయాలన్న, బోర్ వెయ్యాలన్న ఇక్కడ ఓ నాయకుడికి శిస్తు చెల్లించాల్సిందే (అదే ఎక్స్టార్షన్) లేకుంటే మీ అక్రమ నిర్మాణం కూల్చివేయిస్తానని మీరు చేసిన తప్పుకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటానని బెదిరింపుతో లక్షల్లో వసూలు తందా ప్రారంభించారని బిల్డర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏమైనా అంటే స్థానిక ఎమ్మెల్యే అనుచరుడిని అంటూ ఆయనకు చెబితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందంటూ బెదిరింపులు చేస్తున్నారని దానితోపాటు ఇప్పుడు కొంతమంది మహిళ నాయకురాల్లని రంగంలోకి దించి వాళ్ళని అడ్డుపెట్టుకొని లక్షలు వసూలు కోసం ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఈ తతంగమంతా స్థానిక పోలీసుల దృష్టికి కానీ స్థానిక ఎమ్మెల్యే దృష్టికి కానీ తీసుకువెళ్తే తమకు ఏమైనా ఇబ్బందులు వస్తాయో అన్న భయంతో స్థానికంగా ఉన్న బిల్డర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేస్తానని తెలుపుతూ ఫిర్యాదు చేయకుండానే బెదిరింపులకు పాల్పడుతూ లక్షలు వసూలు చేస్తున్న వసూల్ రాజా పై పోలీసులు దృష్టి సారిస్తే బాగుంటుందని బిల్డర్లు కోరుకుంటున్నారు.

### ముఖ్యమంత్రి భార్యగా కాదు...

# టీడీపీ కార్యకర్తగా కుప్పం వచ్చా

**- కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్న నారా భువనేశ్వరి**




కుప్పం (ప్రశ్న న్యూస్) నిత్యం ప్రజల గురించే తపించే చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజలకు అంతా మంచే జరుగుతుందని నారా భువనేశ్వరి అన్నారు. ఐదేళ్ల రాక్షస పాలనలో అన్ని వర్గాల ప్రజలూ ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి గెలవడంతో రాక్షస పాలనకు అడ్డుకట్ట పడిందని అన్నారు. కుప్పం నియోజకవర్గ పర్యటనలో 4వ రోజున రామకుప్పం మండలంలోని చల్దిగానిపల్లిలో మహిళలతో నిర్వహించిన ముఖాముఖిలో భువనేశ్వరి పాల్గొన్నారు. అనంతరం పలమనేరు నియోజవర్గం వి. కోటలో హెరిటేజ్ సహాయంతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ పునరుద్ధరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### ప్రతి 3 నెలలకూ కుప్పం వస్తా

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతి మూడు నెలలకు ఒకసారి కుప్పం నియోజకవర్గానికి వచ్చి అభివృద్ధి పనులను దగ్గరుండి చూసుంటానని మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ వేయడానికి వచ్చినప్పుడే నేను మీకు చెప్పాను. మీకు ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవడం నా బాధ్యత. అటు మంగళగిరిపై నారా లోకేశ్, ఇక్కడ కుప్పం అభివృద్ధిపై నేనూ ఫోకస్ చేశాము. నేను ఇక్కడికి ముఖ్యమంత్రి భార్యలా రాలేదు టీడీపీ కార్యకర్తగా వచ్చాను.

చంద్రబాబు గారు పదేపదే మీ గురించి చెబుతున్నారు. ప్రతి రోజూ కుప్పంలో జరుగుతున్న అభివృద్ధి గురించి అడిగి తెలుసుకుంటున్నారు. గత ప్రభుత్వం చంద్రబాబు గారి మీద అక్కసుతో కుప్పంలో అభివృద్ధి అన్న మాట వినబడకుండా చేసింది. ఇకపై మీకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. కుప్పం అభివృద్ధి కోసం చంద్రబాబు గారు 40 పథకాలు తెచ్చారు.

ప్రతి గ్రామానికి రహదారులు, డ్రైనేజ్, అందరికీ సొంత ఇళ్లు , ఉపాధి కల్పన సహా అన్నింటిపైనా ప్రత్యేక దృష్టి పెట్టాము. కుప్పం నుంచి ఇకపై వలసలు కూడా ఉండవు. ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ సహా అనేక పరిశ్రమలు రాబోతున్నాయి. మీకు స్థానికంగానే ఉపాధి లభిస్తుంది. ఎవరూ ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదు.

### మహిళలు ఆర్థికంగా బలంగా ఉండాలి

నేను నాలుగు రోజులుగా ప్రతి మీటింగ్ లో నూ మహిళల గురించి ఎక్కువగా మాట్లాడుతున్నాను. స్త్రీలు శక్తిమంతులు. మగవారిని మించి పనిచేయగలరు. నేను ఇది చేయలేను అనే భయం లేకుండా ముందడుగు వేయాలి. అప్పుడే అద్భుతాలు సాధించగలరు. చంద్రబాబు గారిని అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టినప్పుడు, నా నిజం గెలవాలి యాత్ర సమయంలోనూ రాష్ట్రమంతటా మహిళలు నాకు అండగా నిలిచారు. నాకు కొండత ధైర్యాన్నిచ్చి నాలో స్ఫూర్తిని నింపారు. మీరుణం తీర్చుకోలేము. మీకు అభివృద్ధి ఫలాలు అందేలా చేయడమే మేము చేయగలము.

### ప్రత్యేక ఆకర్షణగా మహిళా కార్యకర్తలు

రామకుప్పం మండలం చల్దిగానిపల్లి రహదారి పక్కన భువనేశ్వరి గారిని కలవడం కోసం టీడీపీ మహిళా కార్యకర్తలు పెద్దఎత్తున వచ్చారు. వారంతా పసుపు రంగు చీరలు ధరించి జై తెలుగుదేశం అని రాసి ఉన్న కళ్లజోళ్లు పెట్టుకుని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారిని చూడగానే భువనేశ్వరి గారు కారు దిగి ఆప్యాయంగా పలకరించారు. వారు ఇచ్చిన చీర, పసుపు కుంకుమను స్వీకరించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588